జనంపై మరో భారం పడనుంది. సాధారణ రివిజన్‌లో భాగంగా భూముల విలువను ప్రభుత్వం పెంచబోతోంది. వచ్చేనెల 1 నుంచి అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూముల విలువలను పరిగణనలోకి తీసుకుని రివిజన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇప్పటికే రెవెన్యూ అధికారుల నుంచి కమర్షియల్ భూములుగా మార్పుచేసిన వాటి వివరాలు తెప్పించుకొని సబ్‌రిజిస్ట్రార్లు ప్రాథమిక నివేదికలు తయారు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 5శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 20శాతం వరకూ భూముల విలువ పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ చార్జీలపై పడనుంది.

- బహిరంగ మార్కెట్‌కు సమాంతరంగా నిర్ణయం
- వచ్చేనెల 1 నుంచి అమలు
- భారంకానున్న రిజిస్ట్రేషన్లు
- పెంచవద్దంటున్న ప్రజాప్రతినిధులు
- ఇప్పటికే పడిపోయిన రియల్ రంగం
- సగానికి సగం తగ్గనున్న లావాదేవీలు



భూభారం

పెరగనున్న భూముల విలువ

రిజిస్ట్రేషన్ అధికారులు సిద్ధం చేసిన ముసాయిదా ఇలా..

- ఒంగోలు నగరంలోని లాయర్‌పేటలో గజం రూ.29 వేలు ఉన్న భూమి విలువ రూ.30వేలకు పెరగనుంది.
- కొండయ్య బంకు వీధిలో గజం రూ.22వేలు కాగా రూ.24వేలు కానుంది.
- రాజాపానగల్ రోడ్డులో ప్రస్తుతం రూ.30వేలు ఉన్న గజం విలువ రూ.32వేలకు చేరనుంది.
- పెళ్లూరు కోటవీధిలో ప్రస్తుతం గజం రూ.5,400 ఉండగా దాన్ని రూ.6వేలకు పెంచేందుకు సిద్ధమయ్యారు.
- ముక్తినూతలపాడులో ఎకరా రూ.40లక్షలు కాగా ఇకపై రూ.42 లక్షలు కానుంది.
- కొత్తపట్నం మండలం అల్లూరులో ఎకరా భూమి విలువ రూ.9లక్షలు ఉండగా రూ.10లక్షలకు పెంచనున్నారు.
- యరజర్లలో ఎకరా రూ.5.5లక్షలు ఉండగా ఇకపై రూ.6లక్షలకు చేరనుంది.
- మామిడిపాలెంలో ఎకరా రూ.37 లక్షలు ఉండగా రూ.39 లక్షలకు పెరగనుంది.
- కంభం టౌన్‌లో గజం విలువ రూ.6వేలు కాగా రూ.6,200లకు పెంచనున్నారు.
- కంభం ప్రాంతంలో ఎకరం రూ.1.10లక్షలు కాగా.. రూ1.20 లక్షలకు పెంచేందుకు అధికారులు ప్రాథమికంగా ప్రణాళికలు సిద్ధం చేశారు.
- ఈ ప్రతిపాదనలపై జిల్లా మార్కెట్ విలువల కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. బుధ, గురువారాల్లో జాయింట్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అవసరమైన చోట మాత్రమే ధరలు పెంచాలని సూచించారు. అందుకనుగుణంగా మార్పులు, చేర్పులు చేస్తున్నారు.

ఒంగోలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రేటుకు సమాంతరంగా ఉండాలన్న ఆలోచనతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ముసాయిదాను సిద్ధం చేశారు. అందుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న భూముల మార్కెట్ విలువల కమిటీ పలుమార్లు సమావేశమైంది. ఈమేరకు 5శాతం నుంచి 20శాతం వరకు విలువలు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి భూముల విలువను రివిజన్ చేస్తారు. 2019లో సాధారణ రివిజన్ జరిగింది. 2020లో పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు 20శాతం పెంచారు. 2023లో స్పెషల్ రివిజన్ పేరుతో పట్టణ, మండల కేంద్రాలతోపాటు ముఖ్యమైన గ్రామాలలో కూడా భూముల ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఇప్పటికే కుదేలైన రియల్ రంగం

ఈ ఏడాది సాధారణ రివిజన్ పేరుతో భూముల ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆమేరకు అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. అయితే ప్రజాప్రతినిధుల నుంచి మాత్రం ధరలు పెంచవద్దని వినతులు అందుతున్నాయి. గిద్దలూరు ఎమ్మెల్యే భూముల విలువ పెంచొద్దని రిజిస్ట్రేషన్ అధికారులకు లేఖ రాశారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. రెండేళ్లుగా భూముల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పడిపోయాయి. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ దస్తావేజుల సంఖ్య 50శాతానికి పడిపోయింది. జిల్లాలో ఈ ఏడాది రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.502 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా ఇప్పటి వరకూ రూ.242 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే 50శాతం కూడా పూర్తికాలేదు. ఆదాయం తగ్గడానికి రియల్ రంగం దెబ్బతినడమే కారణమని రిజిస్ట్రేషన్ అధికారులే అంటున్నారు. ఈనేపథ్యంలో భూముల విలువ పెంచడం వలన రిజిస్ట్రేషన్లు మరింత తగ్గుతాయని రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టణాల్లో 5, గ్రామీణంలో 20శాతం పెరిగే అవకాశం

పట్టణ ప్రాంతాల్లో 5 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 20శాతం భూముల విలువ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూముల విలువ పెరిగితే అదేస్థాయిలో రిజిస్ట్రేషన్ చార్జీలు అధికమవుతాయి. అలాగే జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులు

మిగతా 6వ పేజీలో

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకోసం వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రకాశం భవన్‌లో శుక్రవారం ధాన్యం సేకరణపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వర్షాల నుంచి పంట ఉత్పత్తులను రైతులు కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టలను అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు మరింత చురుగ్గా వ్యవహరిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సాగు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

విస్తీర్ణం ఎంత? ఇప్పటివరకు ఎంత మోతాదులో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చారు? ఇంకెంత రావాల్సి ఉంది? అన్న అంశాలపై అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. అంతకుముందు సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును వివరించారు. ఈ నెల రెండోవారానికి 216, మూడో వారానికి 564 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.141 కోట్ల నగదును రైతుల ఖాతాకు జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రేషన్ దుకాణాల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులను జనవరి 15 నాటికి భర్తీ చేయాలన్నారు. రేషన్ బియ్యానికి సంబంధించిన అక్రమాలపై 6(ఏ) కేసులు నమోదు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బియ్యం పక్కదారి పట్టకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. జేసీ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పద్మశ్రీ, శ్రీనివాసరావు, గోపీచంద్, రమణ, ఉపేంద్ర, సుభాషిణి పాల్గొన్నారు.



కానిస్టేబుల్ పోస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మెళకువలు నేర్పుతున్న చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు

ఖాకీ కొలువుపై గురి

- పోలీస్ కానిస్టేబుల్ పోస్టు కొట్టేందుకు పట్టుదలతో యువతీయువకుల కృషి
- చలిని సైతం లెక్క చేయకుండా సాధన
- అనుభవజ్ఞుల పర్యవేక్షణలో శిక్షణ
- 6,100 ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఏర్పాట్లు

వివరాలు 7వ పేజీలో

ఆ వైద్యాధికారికి అందలం

- మహిళా ఉద్యోగులను వేధించడంతో సరెండర్
- ఆ వెంటనే పైస్థాయిలో వ్యవహారం నడిపి మళ్లీ జిల్లాకే
- జిల్లాకేంద్ర కార్యాలయంలో అన్నీతానై నడుపుతున్న వైనం
- కూటమి ప్రభుత్వంలోనూ ఉన్నతాధికారుల్లో రాని మార్పు



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి. తన వద్ద పనిచేసే మహిళా ఉద్యోగులపై కన్నేస్తారు. వారు చెప్పినట్లు వినకపోతే వేధింపులకు పాల్పడుతారు. ఆ వేధింపులు భరించలేని ఆ మహిళా ఉద్యోగులు అందరూ ఒక్కటై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన అధికారులు ఆ వైద్యాధికారి చేస్తున్న వికృత చేష్టలు నిజమేనని తేల్చారు. గుట్టుచప్పుడు కాకుండా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఇదీ పశ్చిమప్రాంతంలోని ఒక మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జరిగిన వ్యవహారం. కానీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఏమి జరిగిందో తెలియదు కానీ వారంరోజుల్లోనే తిరిగి జిల్లా వైద్యారోగశాఖకు ఆ డాక్టర్‌ను డిప్యుటేషన్ వేశారు. వాస్తవంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటే కనీసం మరొక జిల్లాలో నియమిస్తారు. కానీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఆ వైద్యాధికారి తన పలుకుబడిని చూపి వారంరోజులు తిరక్కముందే జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వచ్చి వాలిపోయారు.

శాఖలో తిష్ట వేసి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ వైద్యాధికారి వైద్యశాఖలో అనధికారికంగా విధులు నిర్వహించి ప్రైవేటు వైద్యశాలలకు అనుమతులు ఇచ్చేందుకు భారీగా మామూళ్ల వసూలు చేశారన్న ఆరోపణలుఉన్నాయి. అటువంటి

మిగతా 6వ పేజీలో

పోలీసు ఆసుపత్రికి భూమి పూజ

ఒంగోలు క్రైం, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఆసుపత్రి నిర్మాణానికి ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం భూమిపూజ చేశారు. కిమ్స్ హాస్పిటల్ సహకారంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులకు నిత్యం వైద్యసేవలు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక



పోలీసు ఆసుపత్రికి భూమి పూజ చేస్తున్న ఎస్పీ దామోదర్


సౌకర్యాలతో ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సిబ్బంది తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, కిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ టి.గిరినాయుడు, సీఈవో కె.అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ భానుమతి, హౌసింగ్ బోర్డు ఈఈ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

ఎస్పీ దామోదర్‌ను కనిగిరి డీఎస్పీ మహేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన కనిగిరి డీఎస్పీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఎస్పీని కలిసి సబ్ డివిజన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను వివరించారు.

వ్యవసాయ పనులు ముమ్మరం

- బిజీబిజీగా రైతులు, కూలీలు
- జోరుగా ఖరీఫ్ పంటల కోతలు
- రబీ పైర్లలో పురుగు నివారణ, కలుపుతీత పనులు
- విస్తారంగా పొగాకు, శనగ, ఇతర పంటల సాగు



ఒంగోలు సమీపంలో పొగాకు తోటలో అంతరసేద్యం చేస్తున్న రైతులు

ఒంగోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు, కూలీలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు తెరపి ఇవ్వడంతో పంటల్లో అంతరసేద్యం, కోతకు వచ్చిన పంట కోతలు, కలుపుతీత, తెగుళ్ల నివారణ మందుల పిచికారీ, ఇంకా వేయాల్సిన పంటల సాగు తదితర పనులు జోరందుకున్నాయి. సాధారణంగా ఈ సమయానికి ఖరీఫ్ పంటల్లో మూడొంతులు కోత దశకు, రబీ పైర్లు విత్తడం పూర్తవుతుంది. ఈఏడాది రెండు సీజన్లలోనూ ఒకింత జాప్యం జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాలు లేక పంటల సాగు ఆలస్యమైంది. నవంబరులో ఒకసారి, ఈనెల తొలి వారంలో మరోసారి విస్తారంగా వర్షాలు కురిసి రబీ సాగు జాప్యమైంది. ప్రస్తుతం వర్షాలు తెరపి ఇవ్వడంతో ముమ్మరంగా పంటలు వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సుమారు లక్షా 62వేల హెక్టార్లలో పంటలు వేశారు. అత్యధికంగా 70వేల హెక్టార్లలో కంది సాగు చేశారు. 22వేల హెక్టార్లలో మిర్చి, 13వేల హెక్టార్లలో పత్తి, పది వేల హెక్టార్లలో వరి వేశారు. ఇతర పంటలు ఒక మోస్తరుగా సాగయ్యాయి. ప్రస్తుతం ముందుగా వేసిన వరి పంట కోతలు, నూర్పిళ్లు జరుగుతున్నాయి. త్రిపురాంతకం, దర్శి ప్రాంతంలో ఈ పరిస్థితి ఉంది. కంది కాయదశకు చేరుకోగా.. పత్తి తీతలు, మిర్చి పచ్చికాయల కోతలు జరుగుతున్నాయి. ఇక రబీ

మిగతా 6వ పేజీలో



గుండ్లకమ్మ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, బాలాజీ, టీడీపీ నాయకులు

6

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

- అధికారులకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ సూచన
- టూరిజం బోర్డు ఛైర్మన్‌తో కలిసి గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిశీలన

- ఓ తల్లి అరణ్యరోదన
- రెండేళ్ల క్రితం కనిపించకుండాపోయిన కొడుకు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో వెతికినా దొరకని ఆచూకీ
- మనోవేదనకు తోడు ఆర్థిక సమస్యలతో కుటుంబం సతమతం
- ఆరోగ్యం క్షీణించి గుండెపోటుతో ఇంటి పెద్ద కన్నుమూత



గోవిందరావు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

7

ఎక్కడున్నావురా కన్నా.. నాన్న చనిపోయాడు..!

జీజీహెచ్‌లో ఎలక్ట్రానిస్టా గ్రోగ్రఫీ సేవలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే లభ్యమయ్యే ఎలక్ట్రానిస్టాగ్రోగ్రఫీ (ఈఎన్‌జీ) వైద్య పరికరాన్ని ఒంగోలులోని జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జమున, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. సుమారు రూ.35లక్షలు విలువైన పరికరం ఇప్పటి వరకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కాకినాడలో మాత్రమే ఉందన్నారు. కాగా ఒంగోలులోని జీజీహెచ్‌లో కూడా ఏర్పాటు చేయడం ద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఈఎన్‌టీ విభాగంలో ఈ వైద్య యంత్రం అందుబాటులో ఉంటుందని, దీని నిర్వహణకు సిబ్బందికి తగిన శిక్షణ అందిస్తామని ఈఎన్‌టీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ నామినేని కిరణ్ పేర్కొన్నారు.

బీమా నమోదు గడువు పెంపు

బేస్తవారపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసుకున్న పంటలకు బీమా గడువు తేదీని ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఏవో జక్కం మెర్సీ తెలిపారు..

భూభారం!

(5వ పేజీ తరువాయి)

పక్కన ఉన్న భూముల విలువ పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్వల్పంగా పెంచాలని ప్రాథమికంగా నివేదికలు సిద్ధం చేశారు. ఒంగోలు నగరంతోపాటు నగరపంచాయతీలు, మండలకేంద్రాలు, ముఖ్యమైన గ్రామాలలో భూముల విలువ పెరగనుంది..

అభ్యంతరాలు తెలియజేయవచ్చు

జిల్లాలో సాధారణ రివిజన్ మేరకు భూముల విలువలు పెంచనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ల బాలాంజనేయులు తెలిపారు. పెంచిన భూముల ధరలను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ఐజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 24లోపు ఆధారాలతో తెలియజేయాలని కోరారు. 26న సమావేశమై తిరిగి పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటుందన్నారు. వచ్చేనెల 1 నుంచి అమలులోకి వస్తాయన్నారు.

ఆ వైద్యాధికారికి అందలం

(5వ పేజీ తరువాయి)

వ్యక్తి ఇప్పుడు వైద్యశాఖలోనే తిష్టవేశారు. పని కోసం వచ్చే ఉద్యోగులతో మాట్లాడి అంతా తాను చూస్తానంటూ సంబంధిత శాఖ ఉన్నతాధికారి వద్దకు తనే స్వయంగా తీసుకొని వెళ్తున్నారు. ఆ వైద్యశాఖ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ ఉద్యోగులకు తెలియని అంశాలు కూడా ఆయన వద్ద ఉన్నాయంటే వైద్యశాఖ పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు.

వైద్యశాఖను పట్టించుకోని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రభుత్వ శాఖలను ఇప్పటికే ప్రక్షాళన చేసింది. కానీ వైద్యశాఖను మాత్రం పట్టించుకోలేదు. పది నెలల నుంచి రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో ఇన్‌చార్జి పాలన నడుస్తోంది. ఆ కార్యాలయంలో ఏమి జరుగుతుందో తెలియడం లేదు. ఇక్కడ ఏదైనా జరిగితే పైస్థాయిలో తమకు అండదండలు అందించే ఒక అధికారి ఉండటంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకంలో అడ్డగోలుగా వ్యవహరించిన సమయంలో జిల్లా కార్యాలయంలోనే పనిచేసిన ఆ అధికారి ఇప్పుడు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆఫీసులో కీలక స్థానంలో ఉన్నారు. దీంతో తమకు ఏమీ కాదన్న ఉద్దేశంతో కొందరు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్‌తోపాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వైద్యశాఖను ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులు కోరుతున్నారు.

వ్యవసాయ పనులు ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

సీజన్‌లో ఇప్పటి వరకూ సుమారు 65వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు వేశారు. అందులో అత్యధికంగా పొగాకు, శనగ, మినుము ఉన్నాయి. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 20వేల హెక్టార్లలో పొగాకు, 15వేల హెక్టార్లలో శనగ, పదివేల హెక్టార్లలో వరి, పదివేల హెక్టార్లలో మినుము, 4వేల హెక్టార్లలో మిర్చి, 6వేల హెక్టార్లలో ఆలసంద సాగు చేశారు. అన్ని స్థాయిల్లోని ఇంచుమించు అన్ని పంటల్లో తెగుళ్ళ, పురుగుల దాడి పెరిగింది. దీంతో రైతులు కలుపుతీతలు, తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. మరోవైపు ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పొగాకు శనగ పంటలలో ఇడుపులు, లేతపైరు దెబ్బతింటే తిరిగి వేయడం చేస్తున్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- టూరిజం బోర్డు చైర్మన్‌తో కలిసి గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిశీలన



ప్రాజెక్టు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎన్, చైర్మన్ బాలాజీ, నాయకులు

మద్దిపాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ ద్వారా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే బాధ్యత అధికారులు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మల్లవరంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద రిసార్ట్స్ ఏర్పాటుకు ఏపీ టూరిజం బోర్డు చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ రిజర్వాయర్ ఆయకట్టులో సాగు చేసిన పంటలకు నీరందించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధిని మూలనపడేసిందని ఆయన ఆరోపించారు. అనంతరం టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అందుకోసం ప్రాజెక్టు దగ్గర అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సైతం సిమెంటు రోడ్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వర రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, రావూరి వెంకటేశ్వర్లు, మనపాటి రామకృష్ణ, మండపల్లి శ్రీనివాసరావు, గడ్డం రవి, పోకూరి శ్రీనివాసరావు, పార నరసింహారావు, ముచ్చు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రిపేరుపై అలవిమాలిన నిర్లక్ష్యం



ఎర్రగొండపాలెంలో వ్యవసాయ కార్యాలయం పక్కనే ఉన్న రైతుసేవా కేంద్రం

- నేటికీ రైతు భరోసా కేంద్రాలు గానే రైతు సేవా కేంద్రాలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా పేరు మార్చింది. పేరు మార్చి ఐదు నెలలు గడుస్తున్నా, వ్యవసాయాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. భవనాలపై ఉన్న పాత పేర్లను చెరిపేసి కొత్త పేర్లు రాయించాల్సి ఉన్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారికి ఇంకా వైసీపీ వాసన పోలేదని విమర్శిస్తున్నారు. ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలు ఇలాగే ఉన్నాయి. దీనిపై ఏవో కేవీ.శేషారెడ్డిని అడగ్గా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో పేరు మార్పు చేస్తామని చెప్పారు.

నాణ్యతలో డొల్లతనం

గ్రామాలలో నిర్మించిన పలు రైతు సేవా కేంద్రాల నిర్మాణాలలో డొల్లతనం కనిపిస్తోంది. కేంద్రాలు నిర్మించిన సంవత్సరానికే పెయింటింగ్ పెచ్చులూడటం, శ్లాబులు, గోడలకు నెర్రలు కనిపిస్తున్నాయి. గ్రామాలలో ఉన్న కొన్ని రైతు సేవా కేంద్రాల తాళాలు కూడా సిబ్బంది తీయడం లేదు.

నర్సింగ్ వృత్తి ఎంతో మహోన్నతమైంది

- రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తి అత్యంత మహోన్నతమైనదని, అలాంటి అద్భుతమైన అవకాశాన్ని ఉపయోగించుకుని రోగులకు మంచి సేవలు అందించాలని రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ 5వ బ్యాచ్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం జీజీహెచ్‌లోని ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ సుమిత్రాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రిన్సిపాల్ ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు నర్సింగ్ విద్యను ఎంచుకోవడం ఉన్నతమైన గుణానికి నిదర్శనమన్నారు. రోగులకు సేవలందించే అవకాశం నర్సులకు సాధ్యపడుతుందని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని నర్సింగ్ రంగంలో రాణించాలన్నారు. అదే సమయంలో ప్రాక్టికల్ సమయంలో డాక్టర్లు, సిబ్బంది సహకారంతో మంచి జ్ఞానాన్ని పొందాలని సూచించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ మాట్లాడుతూ వైద్యుల కంటే నర్సు చేసే సేవ రోగిని సంతోషంగా ఉంచుతుందని తెలిపారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులకు వైట్‌కోట్లను బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, వైస్‌ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు,సీఎస్ఆర్ఎంవో మాధవీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంతోషం



గిద్దలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ధ్యానం చేయడం ద్వారా మానసిక అలజడిని దూరం చేసుకుని సంతోషంగా జీవించవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామూహికంగా ధ్యానం చేశారు. ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడికి గురికాకుండా ఉండవచ్చని నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ఆర్టీసీలో డోర్ డెలివరీ సేవలు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ నరసింహులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 20: ఆంధ్రజ్యోతి: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీసేవలను విజయంతం చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురు గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. కార్గో డోర్ డెలివరీ ద్వారా డిపోకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీ చేస్తారన్నారు. ఉద్యోగులు బాధ్యతతో డోర్‌డెలివరీ బుకింగ్స్ చేయాలన్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

త్రిపురాంతకం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. అనంతరం బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, అంబేడ్కర్‌కాలనీ యువత పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

గిద్దలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివిధ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. స్థానిక కోదండరామస్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ హిందువులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. సమ్మేళనంలో ప్రతి హిందువు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పట్టణ దేవాలయాల సంఘం కన్వీనర్ యర్రారెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు రమేష్‌రెడ్డి, ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలి



ఎంపికైన జిల్లా బాలుర జట్టుతో అసోసియేషన్ నేతలు

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభచూపి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు, కబడ్డీ అసోసియేషన్‌కు మంచిపేరు తేవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు ప్రసాద్‌లు అన్నారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టును శుక్రవారం వారు ఎంపిక చేశారు. జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టుకు ఈ నెల 15వ తేదీన 16 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి, ఈ నెల 16 తేదీ నుంచి 20వ తేదీ వరకు వారికి శిక్షణ ఇచ్చినట్లు పూర్ణచంద్రరావు తెలిపారు. 16 మంది ప్రాబబుల్స్‌లో ప్రతిభ చూపిన 12 మందిని తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే 50వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలుర, బాలికల టోర్నమెంట్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి రమేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర కబడ్డీ జట్టు వివరాలు

ఎస్.మణిరెడ్డి(కెప్టెన్) మూలగానివారిపాలెం, జి.రామకృష్ణ, జి.లక్ష్మణ్, జి.బాలజీ, డి.వి.మాధవ్(మూలగానివారిపాలెం), ఎ.అశోక్, బి.భవానీశేఖర్(మున్నంవారిపాలెం), కే.సాయిరామ్(కొత్తపట్నం),జి.మల్లికార్జునరెడ్డి(రాజుబంగారుపాలెం), ఎం.సోమేష్(వాడరేవు), కే.ఆకాష్(గొల్లగట్టు), ఎ.వెంకీ(సంతమాగులూరు), మేనేజర్ పి.బాలకృష్ణారెడ్డి, కోచ్ గిరిబాబులు ఉన్నారు.

పొదిలిలో రెవెన్యూ సదస్సుకు హాజరుకానున్న మంత్రి స్వామి

పొదిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే రెవెన్యూ సదస్సులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలు పాల్గొంటారని చెప్పారు. పట్టణ ప్రజలు, రైతులు వారి భూ సమస్యలను తెలియజేసి పరిష్కారమార్గాన్ని పొందాలని సూచించారు. గ్రామసభను జయప్రదం చేయాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈఘటన శుక్రవారం పట్టణంలోని కొత్తూరు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మాచవరం వడ్డెరపాలెంకు చెందిన పల్లపు మాలకొండయ్య(35) కొత్తూరు చప్టా వద్ద వరలు తయారుచేసే యూనిట్ వద్ద పడిపోయి ఉన్నాడు. వరల యూనిట్ వద్దకు వచ్చేవారు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు లోనై మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఎస్ఐ శ్రీరాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అవీఇవీ

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



పాపారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మద్దిపాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో దొడ్డవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మోరబోయిన పాపారావు(30) కరెంటు పనులు చేస్తుంటాడు. తన పొలంలో నీరు పెట్టేందుకు గట్టున ఉన్న మోటార్‌ను రిపేర్ చేస్తుండగా షాక్ తగిలి చెరువులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చెరువులో దూకిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

టంగుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ విషయాలపై సోదరితో గొడవపడి చెరువులోకి దూకిన వ్యక్తిని హెడ్ కానిస్టేబుల్ రక్షించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చెల్లెమ్మతోటకు చెందిన మిరియాల సాయికుమార్, ఆయన అక్క వల్లూరమ్మ పోలీసు స్టేషన్ ఎదురుగా ఊరచెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ వద్దకు గురువారం రాత్రి వచ్చారు. అక్కడ వారిద్దరూ గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన సాయికుమార్ ఊరచెరువులో దూకాడు. అక్క వల్లూరమ్మ పెద్దగా కేకలు వేయడంతో స్టేషన్‌లో ఉన్న పోలీసులంతా పరుగున అక్కడికి చేరుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రావు చెరువులోకి దూకి మునిగిపోతున్న సాయికుమార్‌ను బయటకు తీసి రక్షించారు. వెంకట్రావును ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ఐ నాగమల్లీశ్వరరావు అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో జరిగిన దాడి ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఒంగోలు స్పెషల్ జేఎఫ్‌సీఎం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి కోమలివల్లి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన మద్రావుల సుబ్బారావుకు చెందిన స్థలంలో ఇల్లు నిర్మించుకొనేందుకు ఆయన కుటుంబ సభ్యులు 2018లో గుంతలు తవ్వుతుండగా అదే గ్రామానికి చెందిన మద్రావుల శ్రీనివాసరావు, అతని భార్య పార్వతి, వారి కుమార్తె నాగలక్ష్మిలు కలిసి సుబ్బారావుపై కర్రతో దాడి చేశారు. ఆయన భార్య అడ్డుకోగా ఆమెను కొట్టి గాయపరచారు. బాధితులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నాటి ఏఎస్ఐ దేవదానం కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ బాజీ నాగేంద్రప్రసాద్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆ కేసులో సాక్షులను కోర్టులో హాజరు పరచారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుజాత వాదించారు. నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడిగా ఉన్న మద్రావుల శ్రీనివాసరావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.7వేల జరిమానా, ఏ2, ఏ3 నిందితురాళ్లకు రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాగులుప్పలపాడు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు


- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం
- 13 మంది విద్యార్థులు సురక్షితం



రోడ్డుపక్కన నిలుచున్న విద్యార్థులు(ఇన్‌సెట్లో) కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్‌బస్సు

సింగరాయకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో అందులో ఉన్న విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రైవేటు స్కూల్‌కి చెందిన బస్సు పాకల నుంచి విద్యార్థులను సింగరాయకొండకు తీసుకొస్తుండగా మార్గంమధ్యలో బ్రేక్ రాడ్ వద్ద సమస్య ఉత్పన్నమైంది. దీంతోఅదుపుతప్పి రోడ్డుపక్కనఉన్న పంట కాలువలోకి వెళ్లింది. ఆ సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో కత్తిశ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లి ప్రమాదంపై వివరణ ఇవ్వాల్సిందిగా ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులుకు నోటీసులు ఇచ్చారు.

అన్నదాత.. మూగజీవికి ప్రాణదాత



గేదెను రక్షిస్తున్న రైతులు

మద్రిపూడి 4, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : మద్రిపూడి చెరువుకట్ట కింద ఓ గేదె శుక్రవారం ఉదయం జారి మ్యాన్‌హోల్ తొట్టిలో పడింది. బయటకు రాలేక పెద్దగా రంకెలు వేస్తూ మూగబాధను అనుభవించింది. విషయాన్ని గమనించిన ఓ రైతు మరికొందరు స్థానిక రైతులను కలుపుకొని తాళ్లతో అతికష్టం మీద గేదెను బయటకులాగి ప్రాణాలు కాపాడారు.

మానవత్వం చాటిన న్యాయాధికారి

- నిస్సహాయ స్థితిలో ఉన్న అడ్వకేట్‌కు చేయూత



దుస్తులు అందజేస్తున్న న్యాయాధికారి రాములు

ఆయన వృత్తి రీత్యా న్యాయాధికారి. ప్రవృత్తి ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి తనవంతు సహాయాన్ని అందించి మానవత్వం చాటుకోవడం. ఆయనే ఒంగోలులోని జిల్లా కోర్టులో 3వ అదనపు న్యాయాధికారి రాములు. గతంలో అడ్వకేట్‌గా పనిచేస్తూ అనారోగ్యరీత్యా వృత్తికి దూరమై కనీస ఆదరణ లేక నిస్సహాయ స్థితిలో జీవిస్తున్న శరత్‌కుమార్ దీనస్థితి.. న్యాయాధికారి రాములు మనసును కదిలించింది. ఈ మేరకు శుక్రవారం శరత్‌కుమార్‌ను పిలిపించి కొత్త దుస్తులతో పాటు ఆయన ఆరోగ్యం కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే తిరిగి న్యాయవాది వృత్తిని కొనసాగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయాధికారి రాములు సేవా గుణాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

- ఒంగోలుకార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



ఖాకీ కొలువుపై గురి!



ఖాకీ దుస్తులు ధరించాలని ఒకరి కల. పోలీస్ కావాలని మరొకరి లక్ష్యం. ప్రభుత్వ కొలువు సాధించాలని ఇంకొకరి పట్టుదల. ఇలా ఎవరి గురి వారికున్నా.. అందరి గమ్యం ఒకటే. అదే పోలీస్‌కానిస్టేబుల్ ఉద్యోగం. జల్లులా కురిసే మంచునూ, నిలువెల్లా వణికించే చలినీ లెక్కచేయకుండా తెల్లవారుజాము నుంచే సాధన చేస్తున్నారు. వారే చీరాల నియోజకవర్గ పరిధిలోని కొందరు యువతీ యువకులు. రాష్ట్ర ప్రభుత్వం 6100 కానిస్టేబుల్ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. శారీరక సామర్థ్యం, లాంగ్ జంప్, తదితరాల్లో పట్టు సాధించడానికి మైదానాల్లో కఠోర సాధన చేస్తున్నారు. వీరిలో గతసారి అవకాశాన్ని చేజార్చుకున్నవారున్నారు. ఈసారి కొత్తగా ప్రయత్నిస్తున్నవారు కూడా ఉన్నారు. రూరల్ సీఐ శేషగిరిరావుతో పాటు డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తూ వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు.. యువతీ యువకులతో చీరాలలోని మైదానాల్లో సాధన చేయిస్తున్నారు. మెళకువలు నేర్పుతూ ఉత్సాహ పరుస్తున్నారు. ఇలా శ్రమిస్తున్న యువకులను ఆంధ్రజ్యోతి కదిలించడంతో వారు తమ మనోగతాన్ని వెల్లడించారు.

- చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి)

6100 ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఏర్పాట్లు

- పోలీస్ కానిస్టేబుల్ పోస్టు కొట్టేందుకు పట్టుదలతో యువతీ యువకుల సాధన
- చలిని సైతం లెక్క చేయకుండా కసరత్తు
- అనుభవజ్ఞుల పర్యవేక్షణ

12 ఏళ్ల కల



2012లో మైనస్ మార్కులతో అవకాశాన్ని కోల్పోయాను. కోల్పోయినదాన్నే కొట్టాలని లక్ష్యం పెట్టుకున్నా. అదే కలగా భావించా. అప్పటి నుంచి సాధన ఆపలేదు. 2022 నోటిఫికేషన్ ఆలస్యం కావడంతో బాధపడ్డాను. నాన్న ఐటీసీ కార్మికుడు. అమ్మ గృహిణి. వాళ్లు నాపై నమ్మకం ఉంచారు. ఎంతో కష్టపడి చదివించారు. ఈసారి ఎలాగైనా కల నెలవేర్చుకుని అమ్మనాన్నల కళ్లలో ఆనందం చూస్తా.

- కామాక్షి, రామనగర్

ఐదేళ్లుగా సాధన చేస్తున్నాను



పోలీసు కావాలని చాలాకాలం నుంచి లక్ష్యం పెట్టుకున్నాను. 2018లో పాయింట్ ఫైవ్ మార్కు తగ్గి చాన్స్ కోల్పోయాను. చాలా నిరుత్సాహ పడ్డాను. వ్యవసాయ కుటుంబం కావడంతో ఇంట్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మళ్లీ సాధన చేస్తున్నారు. ఈసారి విజయం సాధిస్తాను.

- పెర్ల హేమంత్ కుమార్, పెర్లవారిపాలెం

పోలీస్ డ్రెస్ వేసుకోవాలని కోరిక



నాన్న బట్టల దుకాణంలో గుమస్తా. అమ్మ ఆశా వర్కర్. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. కానీ నాకు పోలీసు కావాలని కోరిక. అమ్మానాన్నలను ఒప్పించా. ఎన్ని ఇబ్బందులెదురైనా లెక్క చేయను. కఠోర సాధన చేస్తున్నాను. కానిస్టేబుల్ పోస్టు కొడతా.

- సింధూజ, ఈపూరుపాలెం

ఒక్క మార్కుతో కోల్పోయా




గత నోటిఫికేషన్ సమయంలో సివిల్ కానిస్టేబుల్, జైలు వార్డెన్ పోస్టు ఒక్క మార్కుతో కోల్పోయా. ఒకటిన్నర మార్కు తేడాతో ఏపీఎస్‌పీ ఎస్సై చాన్స్ పోయింది. కాస్త నిరాశ చెందాను. అయినా వెనుకడుగు వేయలేదు. కష్టపడి సాధన చేశా. ఈ సారైనా కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకుంటా. విజయాన్ని అందుకుంటా.

- యాసిన్, విఠల్‌నగర్



శిక్షణలో సాధన చేస్తున్న యువకులు



కసరత్తులు చేస్తున్న యువకులు



గోవిందరావు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, కుమార్తె

ఎక్కడున్నావురా కన్నా.. నాన్న చనిపోయాడు..

ఓ తల్లి అరణ్యరోదన

- రెండేళ్ల క్రితం కనిపించకుండాపోయిన కొడుకు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో వెతికినా దొరకని ఆచూకీ
- మనోవేదనకు తోడు ఆర్థిక సమస్యతో కుటుంబం సతమతం
- ఆరోగ్యం క్షీణించి గుండెపోటుతో ఇంటి పెద్ద కన్నుమూత

ఒక్కగానొక్క కుమారుడు. అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఆర్థికంగా శక్తిలేక పోయినా అప్పోసొప్పో చేసి చదివిస్తున్నారు. రెండేళ్ల కిందట కొడుకు కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు వెతకని చోటు లేదు. తిరగని ప్రాంతం లేదు. ఎక్కడా జాడ లేదు. ఆ దిగులుతో తండ్రి ఆరోగ్యం క్షీణించింది. గుండెపోటుతో గురువారం ప్రాణాలు విడిచాడు. భర్త మృతదేహాన్ని చూసి భార్య గుండెలవిసేలా రోదిస్తోంది. తన కొడుకుని తలచుకుని 'ఎక్కడున్నావురా కన్నా.. నాన్న చనిపోయాడు.. తలకొరివి పెట్టడానికైనా రారా.. చిన్నా..' అంటూ ఆపలేని రోదనతో కన్నీరుమున్నీరవుతున్న ఆమెను చూసి అందరి కళ్లు చమర్చాయి.

ఒంగోలు(కల్చరల్), డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలుకు చెందిన చాకిచర్ల గోవిందరావు అతి నిరుపేద బ్రాహ్మణుడు. ఆబ్దికాలలో భోక్తగా వెళుతూ రోజువారీ వచ్చే కొద్ది సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తూ తన కుమార్తె, కుమారుడిని చదివిస్తున్నాడు. ఈ క్రమంలో కుమారుడు శరత్‌కుమార్‌ను నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంటర్మీడియట్‌లో చేర్చాడు. రెండు సంవత్సరాల కిందట కుటుంబం మొత్తం తిరుపతి వెళ్లాలనుకున్నారు. కుమారుడు శరత్‌కుమార్ కూడా తన అమ్మ, నాన్న, అక్కతో కలిసి తిరుపతి వెళ్లి వచ్చి ఒంగోలులో రెండు రోజులు ఉండి తిరిగి కళాశాలకు వెళ్లటానికి నూజివీడు బయల్దేరాడు. 2022 సెప్టెంబర్ 19 ఉదయం ఒంగోలు నుంచి బయల్దేరిన శరత్‌కుమార్ విజయవాడలో తప్పిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రులు తీవ్ర ప్రయత్నాలు చేసినా కుమారుడి జాడలేదు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు, విజయవాడ కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఒకపక్క కొడుకు కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో వెతకటానికి సమయం కేటాయిస్తూ తన వృత్తికి సరిగా హాజరుకాలేక ఆదాయాన్ని కోల్పోతుండటం, మరోపక్క వెదుకులాటకు అయ్యే ప్రయాణ, ఇతర ఖర్చుల కోసం తెలిసిన వారి దగ్గర అప్పు చేయాల్సిన పరిస్థితి రావడంతో గోవిందరావు తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. కుములి పోతుండటంతో రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తోంది. అనేక అనారోగ్య సమస్యలు అతన్ని చుట్టుముట్టాయి. దీంతో గురువారం అర్ధరాత్రి వరకు కొడుకు గురించి కుటుంబసభ్యులతో మాట్లాడుతూ పడుకున్న గోవింద రావు(53)కు ఒక్కసారిగా గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. ప్రస్తుతం ఆ కుటుంబం ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఉమా మహేశ్వర కళాశాల దగ్గర అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. కొడుకు కానరాక దిగులుతో ఉన్న పద్మావతి... భర్త మరణంతో గుండెలవిసేలా రోదిస్తోంది. ఆమె కుమార్తె కన్నీరుమున్నీరు అవుతోంది. నిరుపేద కుటుంబమైన గోవిందరావు దహనక్రియలు, కర్మకాండలకు దాతల సహాయం కోసం ఆ కుటుంబం ఎదురుచూస్తోంది. గోవిందరావు అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.



శరత్‌కుమార్ (ఫైల్)



నాలుగుపళ్ల విభాగంలో ప్రథమస్థానం సాధించిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

నాలుగుపళ్ల విభాగంలో ప్రకాశం ఎడ్ల జత ప్రథమం

గురజాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలోని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో శుక్రవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4780.7 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చాగంటి శ్రీనివాసరావు ఎడ్లజత 4600 అడుగులతో సంయుక్తంగా రెండోస్థానం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలేనికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత 4230.10 అడుగులతో మూడోస్థానం, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన వీరంరెడ్డి కార్తీక్‌రెడ్డి ఎడ్లజత 4024.8 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3933.3 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి.

జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం 15 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటే లక్ష్యంతో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రానున్న మూడు నెలల స్థిర లక్ష్యాలను సాధించేందుకు ఆయాశాఖల ఆధ్వర్యంలో మండలాలవారీ, డివిజన్ల వారీగా నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొనే విధంగా చూడాలన్నారు. వ్యవసాయ రంగంలో అగ్రి డిప్ టెక్నాలజీ వినియోగంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు కౌలు రైతులకు మరింత మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్‌టెక్నాలజీపై రైతుల్లో అవగాహన కల్పించి అవసరమైన మేరకు రైతులకు శిక్షణ ఇచ్చేలా చూడాలని తెలిపారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పంటల బీమా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన 21వ పశుగణన కార్యక్రమాన్ని వచ్చే ఏడాది జనవరి ఆఖరుకు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మంజూరైన మినీ గోగుకులం షెడ్లను డ్వామా శాఖతో సమన్వయం చేసుకొని సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం కింద జిల్లాలో 2426 లక్ష్యం కాగా, 9084 జారీ చేసి రూ 82.73 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లాలో 1200 ఎకరాల్లో పశుగ్రాసం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ కింద మత్స్యకారులందరూ రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ బేబీరాణి, గోపిచంద్, రమణ, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

రాళ్ల కుప్పపైకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్

- స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు
- వీరిలో నలుగురు ఒంగోలుకు చెందినవారు
- డ్రైవర్ నిద్రమత్తులోకి జారడంతో ప్రమాదం
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలో ఘటన



ప్రమాదానికి గురైన బస్

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన కావేరి ట్రావెల్ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత తెలంగాణా రాష్ట్రం, నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ పట్టణ పరిధిలోని నందిపాడు చౌరస్తా వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. బస్సులోని ప్రయాణికులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు నుంచి రాత్రి 11:45 నిమిషాలకు హైదరాబాద్‌కు 35 మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు బయలుదేరింది. మార్గంమధ్యలో నందిపాడు చౌరస్తా వద్దకు చేరుకుంటున్న సందర్భంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో వేగంగా వస్తున్న బస్సు రోడ్డుపక్కనే ఉన్న రాళ్లకుప్పపైకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 11 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిలో ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన అంజిబాబు, సునీత, రాజేష్, పాండు, పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన శారద, సిరి, శ్రీనివాసరావు, సుబ్బారావు, గోపి, రాంచరణ్, హైదరాబాద్‌కు చెందిన శివలక్ష్మి ఉన్నారు. క్షతగాత్రులను స్థానిక మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం ట్రావెల్ బస్సు యాజమాన్యం మరో వాహనంలో క్షతగాత్రులను స్వస్థలాలకు తీసుకెళ్లింది.

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు

పెద్ద దోర్నాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిసేద్యంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని సంస్థ ఎన్ఎఫ్ఏ నాగరాజు అన్నారు. స్థానిక శివసదనులో ఆదర్శసంస్థ ఆధ్వర్యాన చెంచు గిరిజనులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పంటపై రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడంతో అనేక అనర్థాలు వస్తున్నాయన్నారు. నేల నిస్సారమవడంతో పాటు పంట కలుషితమవుతుందన్నారు. అదే గోమూత్రం, పేడతో తయారు చేసిన ద్రవ జీవామృతంతో నాణ్యమైన అధిక దిగుబడులు తీయవచ్చన్నారు.

నేడు చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

చీమకుర్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో విద్యుత్ సమస్యలపై సీజీఆర్ఎఫ్, విజయవాడ వారిచే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తారని ఈఈ పి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలపారు. చీమకుర్తి, పొదిలి, దర్శి, దొనకొండ, కొనకమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను లిఖితపూర్వకంగా ఇవ్వాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, మీటర్, బిల్లుల సమస్యలు, ఓల్టేజీ తదితర విద్యుత్ సమస్యలను ఈ సమావేశంలో పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే దామచర్లకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సత్కరిస్తున్న చైర్మన్ వేణు

ఒంగోలు(రూరల్), డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు-2 నాగార్జున సాగర్ డీసీ చైర్మన్ కంకణాల వేణు శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి బొకే అందజేశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే దామచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, యరజర్ల గ్రామస్థులు పాల్గొన్నారు.

జ్వరపీడితులను పరామర్శించిన ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో జగదీష్

మర్రిపూడి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విష జ్వరాలతో అల్లాడుతున్న రామాయపాలెం గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీవో జగదీష్, ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి కృష్ణ సందర్శించారు. 'రామాయపాలేనికి జ్వరమొచ్చింది' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. శనివారం నుంచి మూడురోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో జగదీష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి హరి ఆధ్వర్యంలో హుటాహుటిన డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచే పనులను చేపట్టారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు పంపిస్తామని చెప్పారు.

అంకితభావంతో పనిచేసిన భూలక్ష్మి


మహిళా కానిస్టేబుల్ భూలక్ష్మిని సన్మానిస్తున్న సీఐ, ఎస్సైలు

కొండపి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళా కానిస్టేబుల్ జె.భూలక్ష్మి వృత్తి పట్ల అంకితభావంతో పనిచేశారని సీఐ సోమశేఖర్ అన్నారు. భూలక్ష్మి కొండపి నుంచి ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆమె వీడ్కోలు సభ శుక్రవారం ఏర్పాటు చేశారు. భూలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆమె సేవలను సీఐ కొనియాడారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ప్రేమ్‌కుమార్, అనూక్, రమేష్‌బాబు, ఏఎస్సై అంకారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువనేస్తం ఫౌండేషన్‌కు సాయం


బంగారుబాబుకి ఆర్థికం సహాయం అందజేస్తున్న ప్రసాద్

సింగరాయకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్‌కు చెందిన రావులపల్లి రాఘవులు 11వ వర్థంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు యువనేస్తం ఫౌండేషన్‌కు ఆర్థిక సాయం చేశారు. అధ్యక్షుడు అంకిపల్లి బంగారుబాబుకు రూ.20 వేల నగదును శుక్రవారం అందించారు. రావులపల్లి ప్రసాద్, మోహన్‌రావు, వెంకట్రావు, ఆది పాల్గొన్నారు.

విధుల్లో కొనసాగించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అకారణంగా విధుల నుంచి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తిమ్మసముద్రం గ్రామానికి చెందిన గ్రామైఖ్య సంఘం, షిరిడి సాయిబాబా గ్రామైఖ్య సంఘం వీవోఏలు నూరుబాషా నాగూరమ్మ, రాచూరి మాధవి ఎంపీడీవో వై.మహాలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు తూబాటి శ్రీకాంత్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గ్రామంలో గ్రామ సమైఖ్య వీవోఏలు పనిచేస్తుండగా కారణాలు చెప్పకుండా ఇటీవల వెలుగు అధికారులు తొలగించరాని చెప్పారు. దాంతో బాధితేలే హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలోని డ్వాక్రా గ్రూపు సంఘాలు కూడా వారిని వీవోఏలుగా ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించారని, వెలుగు అధికారులు వారిని విధుల్లోకి తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీవోను కోరారు.

నేడు వైసీపీ అధినేత జగన్ జన్మదిన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఒంగోలులో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలో జరిగే వేడుకలకు ముఖ్య నాయకులు హాజరవుతారని చెప్పారు. కేక్‌కటింగ్ అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ, రక్తదాన శిబిరం జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇమ్రాన్‌ఖాన్, అంజిరెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, చిన్నా పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు మద్దిపాడులో శనివారం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు తెలిపారు. మాజీ మంత్రి మెరుగు నాగార్జున హాజరవుతారని, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

● కలెక్టర్ అన్సారియా


సీసీరోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలునగరం(కొత్తపట్నం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కొత్తపట్నం మండలం గాదెపాలెంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ శాతం అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని, ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వాటి పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత వరకు అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ సదస్సులో కుల ధ్రువీకరణ, కుటుంబసభ్యుల ధ్రువీకరణపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి సంబంధిత సర్టిఫికెట్లను కలెక్టర్ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు పరిశీలన

అనంతరం కె.పల్లెపాలెంలో చేపడుతున్న సిమెంట్ రోడ్లను కలెక్టర్ అన్సారియా పరిశీలించారు. రూ.2.06కోట్లతో 4.52కి.మీ మేర పనులు చేపట్టామని, అందులో 2.12 కి.మీ. మేర పనులు పూర్తి చేశామని పంచాయతీరాజ్ ఈఈ కోటేశ్వరరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మిగిలిన పనులను సంక్రాంతి లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెమీక్రిస్మస్ సంబరాలు

● హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు


మేయర్ సుజాత నివాసంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ తదితరులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సెమీ క్రిస్మస్ సంబరాలు పలుచోట్ల ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆకర్షించే స్టార్స్, ట్రీల్, విద్యుద్దీపాల వెలుగులతో, క్రిస్మస్ తాతల వేషధారణలతో అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది. ఈమేరకు శుక్రవారం మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో ఒంగోలులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, పలువురు టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు హాజరయ్యారు. కేక్ కట్ చేసి సంతోషాలు పంచుకున్నారు.

డ్వామా కార్యాలయంలో..

స్థానిక డ్వామా కార్యాలయంలో సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కాల్విన్ దైవ సందేశం అందించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేయడంతోపాటు, క్యాండిల్స్ వెలిగించి ఉద్యోగులకు విందును అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీడీ గంగవరపు జోసఫ్ కుమార్, అదనపు సంచాలకులు జి.వండర్‌మెన్, జిల్లా విజిలెన్స్ అధికారి పి.ఝాన్సీదేవి, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీల ఆధ్వర్యంలో..

ఒంగోలులోని సచివాలయ సెక్రటరీల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రిస్మస్ గీతాలు అలరించాయి. కేక్ కటింగ్‌లు, ప్రేమవిందులతో వేడుకలు జరిగాయి.

అన్నవరప్పాడులో..

ఒంగోలు(కల్చరల్):స్థానిక అన్నవరప్పాడు ఒకటవ లైనులోని టైనీ బెల్స్ కిడ్స్ స్కూలు ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు శాంతాక్లజ్ వేషధారణతో ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ తుమ్మల చంద్రశేఖర్, డైరెక్టర్ సుజిత శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటలు, డొంకల ఆక్రమణలను తొలగించాలి

● జేసీ గోపాలకృష్ణ


పెదగొల్లపాలెంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

సింగరాయకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కుంటలు, డొంకల ఆక్రమణలను వెంటనే తొలగించాలని జేసీ గోపాలకృష్ణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి పెదగొల్లపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పంచాయతీ పరిధిలో పొలాలకు వెళ్లే లంబాడీ డొంక, మల్లికార్జున్‌నగర్ పక్కన ఉన్న రామణగుంట, జాతీయ రహదారి వద్ద పెట్రోలు బంకు పక్కన ఉన్న కమసలకుంట, రేగడి చేలకుంట ఆక్రమణకు గురైన విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. తమ భూములకు చెందిన రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని, పట్టాదారు పాసు పుస్తకాలను ఆన్‌లైన్ చేయాలని కోరారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వెంటనే ఆక్రమణలకు గురైన కుంటలు, డొంకలను పరిశీలించి తొలగించాలని అధికారులకు సూచించారు. దీంతో మధ్యాహ్నం నుంచి తమ సిబ్బందితో కలిసి తహసీల్దార్ రవి ఆక్రమణలకు గురైన లంబాడీడొంక, రామణకుంటను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 48 అర్జీలు రాగా అందులో దేవదాయశాఖకు సంబంధించిన 10, పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరు కోరుతూ 33 ఉన్నాయి. సదస్సులో ఆర్ఐ వి.ప్రసాద్, ఈవో పి.కృష్ణవేణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముక్తినూతలపాడులో 50 అర్జీలు

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం ముక్తినూతలపాడులో శుక్రవారం జరిగిన రెవెన్యూసదస్సులో పలు సమస్యలపై గ్రామస్థులు 50 అర్జీలు సమర్పించారు. ఇందులో 3 అర్జీలు తహసీల్దార్ వాసు అక్కడిక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో డీటీ శీలం శ్రీనివాసరావు, సర్వేయర్లు నాశం వెంకటేశ్వర్లు, లింగుగుంట విష్ణువర్దన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చదలవాడలో..

నాగులుప్పలపాడు: రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లోని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని డీఆర్వో చిన్నఓబులేసు సూచించారు. చదలవాడలో శుక్రవారం రెవెన్యూ సదస్సును జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలపై 39 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తక్షణమే 10 అర్జీలు పరిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి వరప్రసాదరావు, సర్వేయరు రత్నాకర్, ఆర్ఐ రమేష్, వీఆర్వో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావు కుటుంబానికి ఆర్థికసాయం


చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మరణించిన పేద బ్రాహ్మణుడు చాకిచర్ల గోవిందరావు కుటుంబానికి బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ తరఫున రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యవర్గం ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులోని బ్రాహ్మణ ఆరామ క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం గోవిందరావు మృతదేహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోవిందరావు భార్య, కుమార్తెలకు ట్రస్ట్ తరపున చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునశర్మ మాట్లాడుతూ గోవిందరావు మరణం తమను ఎంతో కలచివేసిందన్నారు. ఆయన తమ ట్రస్ట్‌లో సభ్యునిగా ఉండి ఎంతో చురుకుగా పనిచేసేవారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబ సభ్యులకు తమకు చేతనైన విధంగా సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలూరు రామారావు, శివదేవుని మురళీధరశర్మ, కూరపాటి ప్రసాదశర్మ, దుర్భాకుల రామ్మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ చొరవతో సమస్య పరిష్కారం


కట్టకు గండి కొడుతున్న ఎక్స్‌కవేటర్

టంగుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో ఈనెల తొలివారంలో కురిసిన వర్షాలకు అనంతరం గ్రామంలో నీరు చేరింది. ఎస్సీ కాలనీకి తూర్పు, దక్షిణం వైపున 15 రోజులుగా నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాన్ని బయటకు పంపాలని ఆప్రాంతవాసులు చిన్నబాలు, వెంకట్రావు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా వారు స్పందించలేదు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఉపసర్పంచ్ కసుకుర్తి భాస్కర్ ముందుకు వచ్చారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్ తెప్పించి గ్రామ సమీపంలోని తుఫాన్ కట్టకు గండికొట్టి మోటార్ల సాయంతో నీటిని బయటకు పంపారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్‌ని అభినందించారు.

వైసీపీ బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రావు

టంగుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడిగా టంగుటూరు మాజీ సర్పంచ్ పుట్టా వెంకట్రావు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. వెంకట్రావుకు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్, వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గుంతలతో తంటా..

● వాహనదారుల అవస్థలు


నడిరోడ్డులో ఉన్న గోతులు

మద్దిపాడు మండలం తెల్లబాడు రోడ్డులోని మలుపుల వద్ద సుమారు అర కిలోమీటర్ రోడ్డు పాడైపోయింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు నడవలేని విధంగా తయారైంది. ఒక గుంతను తప్పించబోయి మరో గుంతలో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఈ గుంతల్లో పడి ఇలపావులూరుకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. రాత్రి సమయాల్లో నడిరోడ్డులో ఉన్న ఈ గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

\- మద్దిపాడు(ఆంధ్రజ్యోతి)

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, కరవది సుబ్బారావు, దాసరి సుందరం, బి.పద్మ, జాలన్న, రామ్మోహన్, శ్యామ్, జె.వెంకటేష్, వి.కోటి, కొంగర నరసింహం, మున్నంగి లక్ష్మయ్య, పేరయ్య, దారా సుబ్బారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తొట్టెంపూడి రామారావు, కోటేశ్వరరావు, ఏడుకొండలు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

23న నిరసనను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో రైతు ఉద్యమాలను అణిచివేతకు వ్యతిరేకంగా ఈనెల 23న కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘాల నాయకులు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించాలని గత 20 రోజులకు పైగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఉద్యమం చేస్తున్నారని, దీనిని కేంద్ర ప్రభుత్వం అణిచివేసేందుకు కుట్రపన్నిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌ను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు రెగ్యులేటరీ మార్కెట్‌లను దెబ్బతీసే విధంగా నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్‌ను ప్రకటించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఈక్రమంలో జరిగే నిరసనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం కార్యదర్శి కేవీరారెడ్డి అధ్యక్షతన కార్యక్రమంలో నాయకులు వైజయంతిబాబు, పమిడి వెంకట్రావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎం.రమేష్, కొత్తకోట వెంకటేశ్వర్లు, వి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

జరుగుమల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెం గ్రామంలో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 6,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

ముగిసిన చెస్ పోటీలు

ఒంగోలు విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో జేకేరాజు చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. ర్యాపిడ్ విభాగంలో మొదటి, ద్వితీయ స్థానాలను పోలూరి కుమారస్వామి, ఎం.సుబ్బారావులు కైవసం చేసుకున్నారు. బిడ్జ్‌లో అభినందన్ బత్తిన, ఎం.సుబ్బారావులు విజేతలుగా నిలిచారు. ఈనెల 24,25వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వారు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా చెస్ సెక్రటరీ ఎస్‌కే.అబ్దుల్‌నబీ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ జేకే.రాజు, ఆర్బిటర్ బి.సుకాంత్ అభినందించారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైలుపేటలోని శ్రీనేతాజీ హైస్కూలు విద్యార్థులు గోలి సాయిమహేష్, గోలి సాయిహర్షలు నేషనల్ తైక్వాండో పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా గురువారం స్కూలులో కరస్పాండెంట్ సీహెచ్.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ అనుపమ క్రీడాకారులను అభినందించారు. పిల్లలను చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు వారు తెలిపారు. కోచ్ శివను ప్రత్యేకంగా అభినందించారు.

అనారోగ్యంతో ఆర్ఎంపీ మృతి

సంతనూతలపాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడుకు చెందిన ఆర్ఎంపీ గుంటూరి ఆంజనేయులు గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘంసాధికారిక కమిటీ కన్వీనర్ కె.నరసింహారావు, ఎం.సుబ్బారావు, పలువురు నాయకులు నివాళులు అర్పించారు.

ఘనంగా రామానుజన్ జయంతి


రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఒంగోలు విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని డీఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అధ్యక్షతన రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కెజియ, విద్యార్థినులు అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలలకు దుస్తుల పంపిణీ


పిల్లలకు దుస్తులు, కుర్చీలను అందజేసిన రాజేంద్రప్రసాద్

ఒంగోలు(కల్చరల్), డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న శక్తిసదన్‌లో బాలలు, మహిళలకు క్రిస్మస్ సందర్భంగా శుక్రవారం ప్రముఖ కవి గుండ్లాపల్లి రాజేంద్రప్రసాద్ దుస్తులను పంపిణీ చేశారు. మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ సదన్‌లోని పిల్లలు, మహిళలు కూర్చుని చదువుకోవటానికి వీలుగా కుర్చీలను సైతం అందజేశారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి బీరం అరుణ, సీహెచ్.కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి, మలాన్ భాను, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి


విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. పేర్నమిట్టలో శుక్రవారం ఆయన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సర్దుబాటు చార్జీలను రద్దుచేయాలంటూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై భారంమోపినప్పుడు టీడీపీ నాడు బాదుడేబాదుడు కార్యక్రమం చేపట్టిందని, నేడు గత ప్రభుత్వం మాదిరిగాను ప్రజలపై విద్యుత్‌చార్జీల భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. అదానితో విద్యుత్ ఒప్పందం రద్దు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కాలేషా, బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ జట్టుకు దుస్తుల వితరణ


క్రీడాకారులతో ప్రిన్సిపాల్ ప్రసాద్, డాక్టర్ సుబ్బారావు

సింగరాయకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాలికల కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తువులను అందజేశారు. వీటిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ నల్లూరి సుబ్బారావు బహూకరించారు. మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చంద్రమోహన్‌రెడ్డి, అధ్యక్షుడు కుర్రా భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు సిరిగిరి రంగారావు, జాయింట్ సెక్రటరీ పిల్లి హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాలు


సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

కొండపి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందని ఆ పార్టీ కొండపి ఏరియా కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన సీపీఐ ఇలవర (నేతివారిపాలెం) శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

నాటుసారా పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

గిద్దలూరుటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాటుసారా కలిగి ఉన్న వ్యక్తిని శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం వెంకటాపురం గ్రామంలో ఓ వ్యక్తి వద్ద నాటుసారా ఉందని సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు తనిఖీ చేశారు. ఆయన వద్ద లీటరు నాటుసారా కలిగి ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టారు. న్యాయాధికారి నిందితుడికి రిమాండ్ విధించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ: డీఎస్పీ

● పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించిన పోలీసులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మార్కాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారానే ప్రాణాలకు రక్షణ ఉంటుందని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద నుంచి హెల్మెట్ దారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో 95 శాతం మందికిపైగా తలకు తీవ్రగాయాలు కావడమే కారణమన్నారు. ప్రమాదాల్లో మరణాలను తగ్గించాలంటే హెల్మెట్ ధరించడం ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలను హైకోర్టు తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందేనన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే ఇకపై సహించేదిలేదన్నారు. అనంతరం సీఐ సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, రాజమోహనరావు, అంకమ్మరావు, సిబ్బంది, పురప్రజలతో కలిసి హెల్మెట్ ధరించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

త్రిపురాంతకం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్ స్టేషన్‌ను దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. బెల్ట్ దుకాణాలు, ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, లా అండ్ ఆర్డర్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ అస్సాన్, ఎస్సై శివబసవరాజులను ఆదేశించారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం
పసుపుగల్లు, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

ప్రకటన : ఆర్.ఓ.సి నెం : 77/C 2024 తేదీ.20-12-2024

ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలం, పసుపుగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలపూడి చెరువు నందు సర్వే నెంబరు 236లో 78 ఎకరాల 84 సెంట్లు విస్తీర్ణంలో ఉన్న చెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొనేందుకు **2024-2025, 2025-2026 మరియు 2026-2027** సంవత్సరములకు అనగా మూడు సంవత్సరముల కాలమునకు టెండర్ కం బహిరంగ వేలం తేది : **27-12-2024**న గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం జరుపబడును.

షరతులు :

1. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అదే రోజు రూ.1000/- చెల్లించి ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల లోపు టెండరు ఫారం పొందవలెను.
2. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్ ఫారం అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును.
3. బహిరంగ వేలం దరావత్తు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. తరువాత 1.00 గంటల నుండి 2.00 గంటల లోపు బహిరంగ వేలం జరుపబడును.
4. సీల్డ్ టెండర్ షెడ్యూల్ ఫారంతో పాటు చింతలపూడి చెరువుకు రూ.5,00,000/-లు, ఏదైనా బ్యాంక్ నుండి గాని గ్రామ పంచాయితీ పసుపుగల్లు పేరు మీద డి.డి. తీసి జతపరచవలెను.
5. టెండర్ కం బహిరంగవేలంలో పాల్గొనేవారు రూ.6,00,000/-లు, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించవలెను.
6. గ్రామ పంచాయతీకి బకాయిలు ఉన్న వారు అనర్హులు.
7. ప్రభుత్వం మద్దతు ధర చింతలపూడి చెరువుకు రూ.16,00,000/-లు, రాని ఎడల టెండర్ కం బహిరంగ వేలం పాటను వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు గ్రామ పంచాయితీకి పూర్తి అధికారం కలదు.
9. టెండరులో కాని బహిరంగ వేలంలో కాని ఏది హెచ్చు మొత్తం అయినచో దానిని మాత్రమే స్వీకరించబడును. కాల పరిమితి అయిన వెంటనే చెరువులను పంచాయతీకి అప్పజెప్పవలెను.

వరగాని బాలసుందరరావు	**పాణెం మౌళాళి**
సర్పంచ్, పసుపుగల్లు,	ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి, పసుపుగల్లు
ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా	ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా,
సెల్ : 9848844126	సెల్ : 9603612141

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● వివిధ సమస్యలపై ప్రజల ఫిర్యాదులు ● అర్జీలు స్వీకరించిన తహసీల్దార్



మార్కాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి). గ్రామాలలో భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ కే.చిరంజీవి తెలిపారు. మండలంలోని నాయుడుపల్లి సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌వో సుబ్బయ్య, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, డీలర్ కందుల శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లాలంటే మధ్యలో వాగు అడ్డుగా ఉందని, వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని గోళ్లవీడపి గ్రామస్థులు తెలిపారు. వాగుమధ్యలో చెప్టా ఏర్పాటు చేయాలని తహసీల్దారు ఏ బాలకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ, కలెక్టర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకుపోతానన్నారు. సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సదస్సులో మొత్తం 13 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీఆర్వో రాంబాబు, సర్వేయర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల : భూసమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ ఏ.సురేష్ అన్నారు. మండలంలోని చినారి కట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజలు తమ భూమికి సంబంధించిన పలు సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే స్వగ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృషికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. పాసు పుస్తకాలు, ఆన్‌లైన్, వెబ్‌ల్యాండ్, భాగపంపిణీ తదితర సమస్యలకు సంబంధిత పత్రాలను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే గ్రామంలోనే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రతిఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చినారికట్ల గ్రామంలో మొత్తం గ్రామసభకు 58 అర్జీలు వచ్చాయి. ఫ్యామిలీమెంబర్ సర్టిఫికేట్ కోసం 4 అర్జీలు రాగా వెంటనే పరిష్కరించారు. పాసుపుస్తకాల ఆన్‌లైన్ చేయమని 19 అర్జీలు, వచ్చినట్లు చెప్పారు. 35 అర్జీలు రేషన్‌కార్డు కోసం, పెన్షన్లు, గృహాల మంజూరు కోసం వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మాధవరెడ్డి, వీఆర్‌వోలు శేకర్‌రెడ్డి, మందా.రమేష్, జానయ్య, దిలీప్‌కుమార్, పలువురు రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ షజీదా అన్నారు. మండలంలోని ఆముదాల పల్లి, తీగదుర్తిపాడు, చింతగంపల్లి గ్రామాలలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలు తమ భూమికి సంబందించిన పలు సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే స్వగ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులు ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృషికి తీసుకొచ్చినట్లైతే వెంటనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహారావు, సర్వేయర్, వీఆర్‌వోలు, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





కొనకమిట్లలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు, గోళ్లవీడపిలో శ్మశానస్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు క్రీడామైదానం కరువు

ఆటలకు దూరం అవుతున్న విద్యార్థినులు



కంభం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల

కంభం, డిసెంబరు 20 : (ఆంధ్రజ్యోతి): కంభంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు ఆటస్థలం కరువైంది. ఈ పాఠశాలలో 452 మందికి పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. అయినప్పటికీ పాఠశాలలో తరగతి గదుల సమస్య కూడా వేధిస్తోంది. ఏళ్ల తరబడి తరగతి గదుల కోసం ప్రయత్నిస్తుండడంతో కొంతమేర ఫలించి ఉన్న తరగతి గదులపైన రేకుల షెడ్లు నిర్మించారు. దీంతో ఆ సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. ఇంకా గదులు నిర్మించాల్సి ఉంది. ఇక ప్రధానంగా పాఠశాలలో ఆటస్థలం లేదు. పాఠశాల ఆవరణలో ముందువైపు ఉన్న కొద్దిపాటి స్థలంలోనే ఉదయం ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్టడీఅవర్స్ సైతం అక్కడే ఏర్పాటు చేస్తున్నా రు. ఆడుకునేందుకు స్థలం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో డ్రిల్ పీరియడ్లలో కూడా క్లాసులోనే గడపాల్సి వస్తోంది. పట్టణంలో ప్రధాన కూడలిలో పాఠశాల ఉండడంతో ఆట స్థలానికి స్థలం కేటాయించే పరిస్థితి లేదు. దీంతో విద్యార్థినులు క్రీడలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతోం ది. పాఠశాల వెనుక ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కొంత భాగాన్ని ఆటస్థలానికి కేటాయి స్తే సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థి నుల తల్లిదండ్రులు కోరుతున్నారు. చదువుతో పాటు ఆటపాటలు నేర్చుకోవడంతో విద్యార్థు ల్లో మానసిక, శారీరక ఆనందం కలుగుతుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బాలికోన్నత పాఠశాలకు ఆటస్థలం కేటాయించాలని కోరుతున్నారు.

అనారోగ్యంతో ఔరంగాబాద్ సర్పంచ్ మృతి



కళావతి (ఫైల్)

కంభం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం ఔరంగాబాద్ సర్పంచ్ వరికుంట్ల కళావతి (55) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన సర్పంచుల ఎన్నికలలో ఔరంగబాద్ పంచాయతీ మహిళకు రిజర్వు కావడంతో వరికుంట్ల సుబ్బయ్య భార్య కళావతిని సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కళావతి అకాలమృతి విషయం తెలిసి మాజీఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మండల నాయకులు నివాళులు అర్పించారు.

అడ్డగోలుగా గ్రావెల్ దోపిడీ



కొండ ప్రాంతంలో తవ్విన గ్రావెల్

గిద్దలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం యడవల్లి పంచాయతీ పరిధిలో గ్రావెల్ దోపిడి అడ్డగోలుగా సాగుతోంది. మామూళ్ల మత్తులోపడి అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. రెండు మూడురోజులుగా యడవల్లి పంచాయతీ పరిధిలోని లెదర్‌పార్కు వద్ద, సమీపంలోని తిప్పపై ఎక్స్‌కవేటర్ల సహాయంతో గ్రావెల్‌ను తవ్వి తీస్తున్నారు. అలాగే రాత్రివేళల్లో యడవల్లి పెద్దచెరువులో సైతం మట్టిని తవ్వి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అటు చెరువులో, ఇటు తిప్పపై గ్రావెల్‌ను తవ్వి ట్రాక్టర్ల ద్వారా బయటకు పంపి అమ్ముకుంటున్నప్పటికీ అక్రమ మైనింగ్ మాఫియాను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఫిర్యాదులు వస్తే తప్ప స్పందించడం లేదు. మామూళ్ల మత్తులోపడి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. గిద్దలూరు మండలంలో అక్రమ తవ్వకాలపై అక్కడి అధికారులు నిఘా ఏర్పాటు చేయడంతో అక్రమార్కుల కన్ను రాచర్ల మండలంపై పడింది. గిద్దలూరు మండలాన్ని ఆనుకుని ఉన్న రాచర్ల మండలంలోని యడవల్లి తిప్ప వద్ద గతంలో సైతం చాలాసార్లు గ్రావెల్ అక్రమ తవ్వకాలు ప్రస్తుతం మళ్ళీ తవ్వకాలు మొదలుకావడం, ఇలాగే కొనసాగుతుందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

నేడు ధ్యాన ప్రక్రియ

గిద్దలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధ్యానదినోత్సవం సందర్భంగా ఈనెల 21న శనివారం రాత్రి 8గంటలకు సామూహిక ధ్యానప్రక్రియ కార్యక్రమంలో పాల్గొనాలని ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా గురువు బీ.ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ ప్రపంచ ధ్యాన ఘట్టంలో భాగస్వామి కానున్నారన్నారు. కోట్లాది మంది ఒకే సమయంలో ధ్యానంలో పాల్గొంటారన్నారు. ప్రత్యక్ష ప్రసారంలో ప్రతి ఒక్కరూ ఎక్కడికక్కడ ధ్యానఘట్టంలో పాల్గొనాలన్నారు. 9441932390 నెంబరును సంప్రదించి ఐడిని పొందవచ్చని సూచించారు.

పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

యూనియన్ బ్యాంకు డీజీఎం రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీజీఎం రవికుమార్

పెద్దదోర్నాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సహకారంతో బ్యాంకులు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగ పరచుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంకు డీజీఎం కే.రవికుమార్ అన్నారు. మండలంలోని ఎగువచెర్లోపల్లి గ్రామం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రుణవితరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకు డీజీఎం కే రవికుమార్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను చిన్న కుటీర పరిశ్రమలకు వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. తిరిగి బ్యాంకులకు సకాలంలో రుణాలు చెల్లిస్తే మరిన్ని రుణాలు అందజేసేందుకు అవకాశముంటుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ వసుంధర మాట్లాడుతూ మహిళలు మహారాణుల్లా వెలగాలంటే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం రూ.3కోట్ల రుణాల చెక్కులను సంఘాల సభ్యులకు అందజేశారు. చిలకచెర్లలోని పాఠశాలకు పదివేల విలువైన మంచి నీరు శుద్ధి చేసే ఫిల్టరును బహూకరించారు. నల్లగుంట్ల, మోట్ల వద్ద బీసీ పాయింట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్యాంకు డీఆర్ఎం శ్రీనివాసులు, డీపీఎం సానిత, కృష్ణకుమారి, మేనేజర్ సాంబశివరావు, బాలకృష్ణ, వర్మ, షేక్ షాపీరా, ఏపీఎం పోలయ్య, దానం, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్నఅధికారులు

పుల్లలచెరువు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటుసారా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు చేశారు. మండలంలోని నరాజముల తాండలో 800 లీటర్లు, పెద్దపీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో బట్టీలపై దాడి చేసి 200 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలి

కొమరోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గృహాలు మంజూరై వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను సత్వరమే పూర్తిచేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, ఎస్సీకాలనీలోని ప్రభుత్వ లేఅవుట్‌ను ఎంపీడీవో మస్తాన్‌వలి, గృహనిర్మాణశాఖ ఏఈ కృష్ణారెడ్డిలు సందర్శించి లబ్ధిదారులకు పలు సూచననలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై బిలులు రాని లబ్ధిదారులు ఈ ప్రభుత్వంలో నిర్మాణాలను పూర్తిచేసుకొని బిల్లులు పొందవచ్చునన్నారు. గతంలో ఇసుక, సిమెంటు, ఐరన్ అధిక ధరలు ఉండడంతో కొందరు నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపి వేశారన్నారు. వారందరికీ ప్రస్తుతం అవకాశం కల్పిస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

● పంచాయతీ కార్యాలయం వద్ద సుందరయ్యకాలనీ వాసుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

పెద్దదోర్నాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు శుక్రవారం ఆందోళన నిర్వహిం చారు. కాలనీకి మొత్తానికి ఒక బోరు బావి, ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నా సరి పోవడం లేదని, నీటికోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. పనుల కాలంలో నీటికోసం ఎక్కడికి వెళ్లాలని పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. దీంతో స్పందించిన కార్యదర్శి శివ కోటేశ్వరరావు సరిపడే విధంగా ట్యాంకరుతో సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న భరణీ

బేస్తవారపేట, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ సందర్భంగా బేస్తవారపేటలో శుక్రవారం నిరుపేదలకు క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో వేశపోగు భరణి, కవలకుంట్ల ఇస్సాక్‌లు వృద్దులకు, వితంతువులకు, ఎదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గుర్రం అనిల్, కె.మల్లయ్య, చిన్న కాశన్న, డేవిడ్, మోషె, రాజయ్య, తిమోతి, నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు సెమీ క్రిస్మస్ వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, : స్థానిక స్పూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాలలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ భాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా సబ్‌కలెక్టర్ ఎస్‌వీ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, పురప్రముఖులు హాజరువతారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండల వీఆర్‌వోల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా శ్రీరామ్ రంగయ్య, ఉపాధ్యక్షులుగా పి.డానియేలు, ప్రధాన కార్యదర్శిగా ఎ.శివారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దార్ల యోనా, కోశాధికారిగా భూపని రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు వాసవి విద్యానికేతన్‌లో మెగా ఫుడ్ ఫెస్ట్

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూ బజార్‌లోని వాసవీ విద్యా నికేతన్‌లో శనివారం మెగాఫుడ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య శుక్రవారం తెలిపారు. విద్యార్థులు సుమారు 210 రకాల వంటకాలు ప్రదర్శిస్తారన్నారు. ఈ ఫుడ్ ఫెస్ట్ ద్వారా పౌష్టికాహార విలువలు తెలియజేస్తామన్నారు.

క్రికెట్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ



క్రికెట్‌లో విజయం సాధించిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 20 ఆంధ్రజ్యోతి: మార్కాపురం భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రీమియర్ లీగ్‌లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపాల్ కేవీ నాగరాజు విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ..ఒంగోలు శర్మ కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ ఫైనల్ పోటీలో భాష్యం ఒంగోలు-1 బ్రాంచ్ మీద మార్కాపురం భాష్యం పాఠశాల 2 పరుగుల తేడాతో విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జ్ ఎన్ హేమసుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

ఒంగోలు విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని హైదరీక్లబ్ లో జేకేరాజు చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. ర్యాపిడ్ విభాగంలో మొదటి, ద్వితీయ స్థానాలను పోలూరి కుమారస్వామి, ఎం.సుబ్బారావులు కైవసం చేసుకున్నారు. బ్లిడ్జ్‌లో అభినందన్ బత్తిన, ఎం.సుబ్బారావులు విజేతలుగా నిలిచారు. ఈనెల 24, 25వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వారు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా చెస్ సెక్రటరీ ఎస్‌కే.అబ్దుల్‌నబీ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ జేకే.రా జు, ఆర్బిటర్ బి.సుకాంత్ అభినందించారు.

పొదుపు మహిళలకు విరివిగా రుణాలు

పామూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపు మహిళలకు విరివిరిగా రుణాలు ఇప్పించి లక్షాధికారులను చేయడమే లక్ష్యమని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ డి. రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పామూరు, సీఎస్‌పురం మండలాలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల కింద పొదుపు గ్రూపు సభ్యులకు కెనరా బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో కెనరా బ్యాంకు డీఎం రాఘవేంద్ర, పామూరు, సీఎస్‌పురం కెనరా బ్యాంక్ శాఖ మేనేజర్లు, ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులకు 1994 - 95 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆర్థిక సహకారంతో యూటీఎఫ్ రూపొందించిన టెస్ట్ పేపర్లను ఉచితంగా శుక్రవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సహకారం మరువలేమని ఇన్‌చార్జ్ హెచ్ఎం జె.పోతురాజు అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎన్. వెంకట్రామయ్య, షేక్ పాదుషా, పూర్వ విద్యార్థులు షేక్ షమ్మి, కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

దర్శి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నియోజకవర్గంలోని పాస్టర్ల దంపతులకు శుక్రవారం బట్టలు పంపిణీ చేశారు సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించి కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పాస్టర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ లోక్‌అదాలత్

దర్శి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం చీమకుర్తిలో విద్యుత్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు దర్శి ఈఈ పి.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు

» ప్రత్యేకాధికారి మాధురి



తాళ్లూరు: అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారి మాధురి

తాళ్లూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ మాధురి తెలిపారు. శుక్రవారం తూర్పుగంగవరం సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో అనేక తప్పులు దొర్లాయని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కార మార్గం చూపాలన్నారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు విన్నవించగా, ప్రత్యేకాధికారి అక్కడికి వెళ్లి పరిశీలించి బాట సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కె.సంజీవరావుకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్ల నాగమణి, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు శివారెడ్డి, రమణారెడ్డి, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

దొనకొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో జరిగిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టాదారు పాస్‌పుస్తకం నిమిత్తం 103 అర్జీలు, భూమి కొలతల నిమిత్తం 14, 22ఏ నిమిత్తం ఒక దరఖాస్తును రైతులు అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ రైతులు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకుడు పెమ్మసాని లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో 21 అర్జీలు

పామూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని రేణిమడుగు, సిద్ధవరం గ్రామాల్లో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై 21 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎం.పానకాలరావు, ఈవో నరసింహాబాబు, ఎంఆర్ఐ బి.మల్లికార్జున, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులో భూసమస్యల పరిష్కారం

ముండ్లమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించనున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదఉల్లగల్లులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రైతుల సరిహద్దు వివాదాలు, రికార్డుల్లో తప్పులు లాంటివి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కోటంరాజు, వీఆర్‌వోలు పెద్దన్న, బ్రహ్మతేజ, మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కారం

దర్శి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు సమస్యల పరిష్కార వేదికలుగా మారాయని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అన్నారు. దీర్ఘకాలిక సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతుండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని తానంచింతలలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు ఈ సదస్సులో ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రధానంగా శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. దీంతో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వెంటనే ఎక్స్‌కవేటర్ ద్వారా బాగు చేయించి శ్మశాన వాటికను ఏర్పాటుచేశారు. అలాగే పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన భూములకు హద్దులు ఏర్పాటుచేయాలి

కురిచేడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని శ్మశాన భూములకు హద్దులు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరారు. శుక్రవారం కురిచేడు పంచాయతీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రజనీకుమారి పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు పది అర్జీలు ఇచ్చారు. గ్రామంలోని శ్మశానికి హద్దులు చూపాలని కోరారు. తహసీల్దార్ వెంటనే హిందూ, ముస్లిం శ్మశాన వాటికల విస్తీర్ణాలను పరిశీలించారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేయాలని సర్వేయర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేసనపల్లి కిష్టయ్య, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భూసమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు రెవెన్యూ సదస్సుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ అశోక్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కోడిగుడ్లపాడులో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను సదస్సు దృష్టి తీసుకువచ్చారు. నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

కాగా, చినిర్లపాడు గ్రామం లోని భూ సమస్యలపై టీడీపీ నేతలు వెంకటరెడ్డి, ఐవీ నారాయణ, నంబుల వెంకటేశ్వర్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.



డీఎస్పీ మహేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న పామూరు సీఐ భీమానాయక్

కనిగిరి డీఎస్పీగా మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కనిగిరి డీఎస్పీగా మహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డివిజన్‌లోని వివిధ మండలాల పీఎస్‌లు, సర్కిల్ కార్యాలయాల పోలీసు అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మహేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో శాంతి భద్రతలు కాపాడటమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. గ్రామాల్లో వర్గ వైషమ్యాలకు తావివ్వకుండా అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రధాన మార్గాల్లో ఎక్కువగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో సీఐలు ఖాజావలి, భీమానాయక్, ఎస్ఐలు శ్రీరాం, మాధవరావు, కోటయ్య, కిషోర్‌బాబు, వివిధ సర్కిల్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం
పసుపుగల్లు, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

ప్రకటన : ఆర్.ఓ.సి నెం : 77/C 2024 తేదీ. 20-12-2024

ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలం, పసుపుగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలపూడి చెరువు నందు సర్వే నెంబరు 236లో 78 ఎకరాల 84 సెంట్లు విస్తీర్ణంలో ఉన్న చెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొనేందుకు **2024-2025, 2025-2026** మరియు **2026-2027** సంవత్సరములకు అనగా మూడు సంవత్సరముల కాలమునకు టెండర్ కం బహిరంగ వేలం తేది : **27-12-2024**న గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం జరుపబడును.

షరతులు :

1. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అదే రోజు రూ.1000/- చెల్లించి ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల లోపు టెండరు ఫారం పొందవలెను.
2. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్ ఫారం అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును.
3. బహిరంగ వేలం దరావత్తు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. తరువాత 1.00 గంటల నుండి 2.00 గంటల లోపు బహిరంగ వేలం జరుపబడును.
4. సీల్డ్ టెండర్ షెడ్యూల్ ఫారంతో పాటు చింతలపూడి చెరువుకు రూ.5,00,000/-లు, ఏదైనా బ్యాంక్ నుండి గాని గ్రామ పంచాయితీ పసుపుగల్లు పేరు మీద డి.డి. తీసి జతపరచవలెను.
5. టెండర్ కం బహిరంగవేలంలో పాల్గొనేవారు రూ.6,00,000/-లు, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించవలెను.
6. గ్రామ పంచాయతీకి బకాయిలు ఉన్న వారు అనర్హులు.
7. ప్రభుత్వం మద్దతు ధర చింతలపూడి చెరువుకు రూ.16,00,000/-లు, రాని ఎడల టెండర్ కు బహిరంగ వేలం పాటను వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు గ్రామ పంచాయితీకి పూర్తి అధికారం కలదు.
9. టెండరులో కాని బహిరంగ వేలంలో కాని ఏది హెచ్చు మొత్తం అయినచో దానిని మాత్రమే స్వీకరించబడును. కాల పరిమితి అయిన వెంటనే చెరువులను పంచాయతీకి అప్పజెప్పవలెను.

వరగాని బాలసుందరరావు
సర్పంచ్, పసుపుగల్లు,
ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా
సెల్ : 9848844126

పాణెం మౌళాళి
ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి, పసుపుగల్లు
ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా,
సెల్ : 9603612141

అధికారులు పద్ధతి మార్చుకోవాలి

» ఎంపీపీ గంగసాని లక్ష్మి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ గంగసాని లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పంటల ఈక్రాప్, సబ్సిడీ విత్తనాల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ, 104 వైద్య సేవలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సర్పంచ్‌ల ఆమోదం లేకుండా పనులు పూర్తిచేసి సంతకాలు పెట్టమని కొంతమంది పంచాయతీ కార్యదర్శులు అంటున్నారని పేర్కొన్నారు. ఇలాగే వ్యవహరిస్తే సంబంధిత కార్యదర్శులు ఇబ్బందులు పడతారన్నారు. బొట్లగూడూరు ఎంపీటీసీ పోలినేని శ్రీను మాట్లాడుతూ గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఈసందర్భంగా శ్మశానానికి వెళ్లేందుకు కనీసం అప్రోచ్ రోడ్డు కూడ వేయలేదన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసిన రెవెన్యూ, హైవే అధికారులు స్పందించలేదన్నారు. ఏపీఎం జి.విద్యాసాగర్ మాట్లాడుతూ మండలంలో శ్రీనిధి రుణాల రికవరీ సక్రమంగా లేదన్నారు. దీంతో కొత్త రుణాలు మంజూరు కావడంలేదని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ మండలంలోని చిలంకూరు, తూర్పుకోడిగుడ్లపాడు, వీరభద్రపురం ఎస్సీ కాలనీల్లో రోడ్డు నిర్మాణాలకు రూ.1.95 కోట్లు మంజూరుకాగా టెండర్లు పిలిచినట్టు చెప్పారు. ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధికి రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. మోపాడు రిజర్వాయర్ నీటిని అనధికారికంగా వదిలినవారిపై ఎలాంటి చర్యలు తీసుకొన్నారని ఎంపీపీ ప్రశ్నించగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

సమావేశాలకు రాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో బి.సురేష్‌ను ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో వైస్ఎంపీపీ గందం ఏసురత్నం, ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, విద్యుత్ ఏఈ షేక్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

కురిచేడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు మండలంలో నెలకొన్న పలుసమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఏఈ హనుమాన్ మాట్లాడుతూ గ్రామీణ మంచినీటి పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వెలిగొండ జలాశయం నుంచి మంచినీటిని పైప్‌లైన్ ద్వారా తీసుకువచ్చి శాశ్వతంగా రక్షిత నీటికి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు హనుమాన్ తెలిపారు. విద్యుత్ ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మూడు ఫేజ్‌ల లైన్లు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. గ్రామాలలో శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించాలని సభ్యులు కోరారు. పడమర నాయుడుపాలెం గ్రామంలో మూడు బజార్లకు నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కోరారు.

కాగా, సమావేశానికి ఎక్కువ మంది అధికారులు రాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ నాగరెడ్డి, ఎంపీడీవో సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి

దర్శి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. శుక్రవారం ఒంగోలులో జిల్లా ఎస్పీ దామోదర్‌ను కలిశారు. ఈసందర్భంగా గత ఎన్నికలలో జరిగిన అక్రమాలను వివరించారు. అప్పటి అధికారులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించి అనేక మంది టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ శ్రేణులపై దాడులు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. గత ఎన్నికల్లో జరిగిన అక్రమాలను గుర్తించి దాడులకు పాల్పడిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట టీడీపీ నేతలు పుల్లలచెరువు చిన్నా, దారం సుబ్బారావు, సందు రామయ్య ఉన్నారు.

టీడీపీలో విభేదాలు లేవు

తాళ్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల టీడీపీలో ఎలాంటి విభేదాలు లేవని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి తెలిపారు. తామంతా నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బాటలోనే పయనిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల టీడీపీలో విభేలున్నట్లు ఓపత్రికలో వచ్చిన వార్తను(ఆంధ్రజ్యోతి కాదు) తీవ్రంగా ఖండించారు. తామంతా ఐకమత్యంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. డాక్టర్ లక్ష్మి సూచనల మేరకు పార్టీని బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. పెత్తనాల కోసం ఎవరూ పాకులాడటం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ కాలేషావలి, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, మన్నేపల్లి చెరువు ప్రెసిడెంట్ చంద్రగిరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మోపాడు ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక

పామూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు రిజర్వాయర్ ప్రాజెక్టు సూపర్ చైర్మన్ ఎన్నిక శనివారం బంగ్లా వద్ద జరుగుతుందని ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ తెలిపారు. ఆర్డీవో కేశవవర్ధన రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వాయర్ పరిధిలోగల నీటిసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దొనకొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం టీడీపీ నాయకులు యగ్గోని యల్లారెడ్డి, మన్నెం గాలయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతుల శ్రేయస్సు నిమిత్తం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను పొందా లన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్-ఏ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వార్డు సభ్యురాలు

పామూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతి సభ్యురాలు నీలం కొండమ్మ, ఆమె భర్త రామయ్యలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు రామయ్య దంపతులకు టీడీపీ కండువాలు మెడలో వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉగ్ర చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైపార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, చంచు కొండయ్య, ఎం.నరసింహారావు, వై.రమేష్, మన్నం రమణయ్య, గోళ్ల మాల్యాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థులకు మెమెంటోలు అందజేసిన డాక్టర్ భగవాన్ తదితరులు

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని అధిగమించేలా ముందుకు సాగినప్పుడే భవిష్యత్తులో బంగారు బాట ఏర్పడుతుందని కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ డీన్ డాక్టర్ కె.భగవాన్ అన్నారు. స్థానిక ఎంఎస్ఎం విజేత ఐఐటీ అండ్ నీట్ అకాడమీ విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భగవాన్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో నైపుణ్యాలను పెంచుకుని ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ కోర్సులను ఎంచుకోవటం వల్ల భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కనిగిరి లాంటి మారుమూల ప్రాంతంలో కూడా అత్యుత్తమ ఫలితాలతో స్టేట్ ర్యాంకులు సాధిస్తున్న ఎంఎస్ఎం విజేత కళాశాల విద్యార్థులను అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందచేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్శిటీ జోనల్ హెడ్ శివరామకృష్ణ, మస్తాన్‌వలి, ఎంఎస్ఎం విజేత కళాశాల యాజమాన్యం పసుపులేటి అరుణోదర్, వేముల శ్రీరాములు, కాకర్ల మాధవరావు, పఠాన్ మస్తాన్‌వలి, గణితశాస్త్ర లెక్చరర్ నారాయణ, ఉప్పుటూరి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

53 మద్యం సీసాలు పట్టివేత

వెలిగండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. వెలిగండ్లకు చెందిన షేక్ కాశీం అనే వ్యక్తి శుక్రవారం మద్యం కొనుగోలు చేసి అక్రమంగా మద్యం తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్టు చెప్పారు. అతని వద్ద ఉన్న 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మండలంలో కోడిపందాలు, పేకాట లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

26న రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఏపీఆర్ఎస్ఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఒంగోలు బస్టాండు సెంటరులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవహేళన చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలగురవయ్య, శాంతరాజ్, నర్సింహులు, బాలబాదుర్ల, కోటపాటి రమణ, కొండచిన్నయ్య, భాస్కర్, కొండయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, ధర్మేంద్ర తదితరలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పేద పాస్టర్‌లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతిఏటా క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పేదలకు దుస్తులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, రంగనాయకులరెడ్డి, పాస్టర్‌లు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

కనిగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈఘటన శుక్రవారం పట్టణంలోని కొత్తూరు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మాచవరం వడ్డెరపాలెంకు చెందిన పల్లపు మాలకొండయ్య (35) కొత్తూరు చప్టా వద్ద వరలు తయారుచేసే యూనిట్ వద్ద పడిపోయి ఉన్నాడు. వరల యూనిట్ వద్దకు వచ్చేవారు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు లోనై మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఎస్ఐ శ్రీరాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

పీసీపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవించింది. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. సంపూర్ణ అనే మహిళ పురుడు పోసుకునేందుకు తన స్వగ్రామమైన పీసీపల్లి మండలం పెదయిర్లపాడుకు కనిగిరి డిపోకు చెందిన బస్సులో బెంగుళూరు నుంచి భర్త, ఆమె చెల్లితో వస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 2.50గంటల సమయంలో బస్సు రాయచోటి సమీపంలోని రామాపురం వద్దకు వచ్చేసరికి ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. ఈవిషయం డ్రైవర్లైన రసూల్, బాబులకు భర్త చెప్పడంతో వెంటనే బస్సును రోడ్డుపక్కన ఆపారు. బస్సులోని మహిళా ప్రయాణికుల సహకారంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆర్టీసీ డ్రైవర్లు 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తల్లీబిడ్డను కడప రిమ్స్‌కు తరలించారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. అక్కడినుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్టు బంధువులు తెలిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

ముండ్లమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. లేనిపక్షంలో సదరు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఉంటాయన్నారు. కుటుంబ యజమాని చనిపోతే ఆ కుటుంబం వీధినపడే పరిస్థితులు ఉంటాయన్నారు. వాహన చోదకులు తమ వెంట వాహన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణిస్తే కేసుతు నమోదు చేస్తామని చెప్పారు. ప్రతిరోజు వాహనాలు తనిఖీ చేయటం వల్ల ప్రమాదాలు నివారించ వచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు పీవీ హనుమంతరావు, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం



ప్రత్తిపాడులోని అగ్రీ ల్యాబ్

- విత్తనాలు, ఎరువుల నాణ్యత తేలటం గగనమే
- ఏఓలు చెయ్యాల్సిన టెస్టులు ఏఈఓలు చేస్తున్నారు
- ల్యాబ్‌లు పెట్టిన లక్ష్యానికి తూట్లు
- ఉమ్మడి జిల్లాలోని 15 కేంద్రాల్లోనూ అదే దుస్థితి

అగ్రీ పరీక్షలు.. అంతంతమాత్రమే

గుంటూరు సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోట్లు కుమ్మరించి ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఫలితంగా రైతు సేవలో మునిగి తేలాల్సిన అగ్రీ ల్యాబ్‌లు వృధాగా పడివున్నాయి. విత్తనాలు, ఎరువుల నాణ్యత నిర్ధారించేందుకు అన్ని రకాల పరికరాలు ఉన్నప్పటికీ పరీక్షలు చేసే వారు లేక ఉసూరు మంటున్నాయి. నాబార్డుకు చెందిన రూ. 200 కోట్ల నిధుల తో 2021 లో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో మినహాయించి ప్రతి నియోజకవర్గంలో ఈ ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 నియోజకవర్గ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇక్కడ విత్తనాలు, ఎరువుల నాణ్యతను నిర్ధారిస్తారు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తారు. ఎరువుల్లో న్యూట్రియంట్లు(పోషకాలు) , తేమ శాతం, పార్టికల్ సైజును పరీక్షిస్తారు. ఇటువంటి పరీక్షలు చేయడం ద్వారా రైతులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుంది. నకిలీలు, కల్తీ లకు కళ్ళెం పడుతుంది.

నెలకు 80 కి పైగానే నమూనాలు...

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ల్యాబ్ లకు ప్రతి నెలా 80 నుంచి 100 నమూనాలు పరీక్షల నిమిత్తం వస్తున్నాయి. వాటిని అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన వ్యవసాయ అధికారి మాత్రమే పరీక్షలు జరపాలని ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్- 1985 చెబుతోంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ ల్యాబుల్లో ఏఓ లు లేరు. కేవలం ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారులు) మాత్రమే పరీక్షలు నిర్వహించి ఫలితాలు తేలుస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఇదే తంతు నడుస్తోంది.

అంతా తూతూ మంత్రం..

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ల్యాబుల్లో జరుగుతున్న విత్తనాలు, ఎరువుల

(మిగతా 6వ పేజీలో..)



ప్రత్తిపాడు అగ్రీల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న ఏఈఓ

- ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో అస్తవ్యస్తం
- సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు వీల్లేదు
- ఈ-స్టాంపింగ్ విధానాన్ని రద్దు చేసే యోచన

ప్రక్షాళన దిశగా రిజిస్ట్రేషన్..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సకల వ్యవస్థలను గాడి తప్పించినట్లుగానే గత ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా భ్రష్టు పట్టించింది. ఏకపక్ష నిర్ణయాలతో సదరు విభాగాన్ని కునారిల్లేలా చేసింది. సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో ఇష్టారీతిన వ్యవహరించింది. సర్వర్ నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో వారు కమీషన్ల కోసమే అన్నట్లు ఉన్నారు తప్పితే ప్రజల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. 2.0 పేరిట కార్డు ప్రైమ్ విధానాన్ని అమలు చేసి ప్రజలను నానా ఇక్కట్లకు గురి చేసింది. జ్యుడీషియల్ పత్రాల స్థానంలో ఈ స్టాంపింగ్ ఇలా ఒక్కటేమిటీ అన్నీ అడ్డగోలు నిర్ణయాలతో సదరు శాఖను తిరోగమన బాట పట్టేలా చేసిన గత ప్రభుత్వానిది. ఇక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ అంటూ గత ప్రభుత్వం చేసిన హడావిడి ప్రహసనాన్ని తలపించింది తప్పితే ప్రజలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ఇవన్నీ ఒక ఎత్తయితే రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలను తమ అడ్డాలుగా మార్చుకుని రాజకీయ పైరవీలతో వైసీపీ నేతలు చెలరేగిపోయారు. ఏళ్ల తరబడి ఒకే పోస్టింగ్‌లో ఉన్నవారిని కొనసాగిస్తూ ఉద్యోగుల బదిలీలను కూడా అపహాస్యం చేసిన ఘనత గత పాలకులది. వీటన్నింటి మధ్య ప్రజలు తమ హక్కుగా పొందాల్సిన రిజిస్ట్రేషన్‌ల కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితిని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలను సవరించడంతో పాటు మొత్తం రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేసే చర్యలు కూటమి ప్రభుత్వంలో ఊపందుకున్నాయి. దీనిలో భాగంగా గత ప్రభుత్వం జారీ చేసిన కొన్ని ఉత్తర్వులను ఇప్పటికే రద్దుబాట పట్టించిన ప్రభుత్వం ఐదేళ్లలో జరిగిన అడ్డగోలు రిజిస్ట్రేషన్‌ల నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమయి ఉంది

దాదాపుగా ఐదు వేల రిజిస్ట్రేషన్లు....

వైసీపీ ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు అంటూ హడావిడి చేసిన సంగతి విదితమే. ఈ విధానంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల రిజిస్ట్రేషన్లు సచివాలయాలు వేదికగా జరిగినట్లు తెలుస్తోంది. ఇక్కడ జరిగిన వాటిల్లో ఎక్కువ శాతం వైసీపీ నేతల ఒత్తిళ్లతో నిబంధనలకు విరుద్ధంగా జరిగినవేననే ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు కూడా చాలావరకు సచివాలయాల్లోనే జరిగాయి. వీటన్నింటిపై విచారణకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ విధానానికి పూర్తిగా ఎత్తివేసి సదరు విభాగానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా అడుగులేస్తోంది

భూ దందాలకు దన్నుగా...

నిబంధనలను కాలరాసి ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో వైసీపీ నేతాగణం పోటీ పడింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి తమ పబ్బం గడుపుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఈ అడ్డగోలు రిజిస్ట్రేషన్‌ల లెక్కతేల్చాలని ఆదేశాలు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో బాపట్ల జిల్లాలో 76 ఎకరాల వరకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 250 ఎకరాల వరకు ఉండొచ్చనేది అంచనాగా ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వ నిబంధనలేవీ పాటించకుండా పుట్టగొడుగుల్లా గత ప్రభుత్వంలో అక్రమ లే అవట్లు వెలిశాయి. వీరి పాపాలకు రిజిస్ట్రేషన్ శాఖ కూడా తనవంతుగా సహకారం అందించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 550 లే అవుట్లను అక్రమమైనవాటిగా గుర్తించి వాటి వివరాలను ప్రజల ముందుంచింది. వీటి విషయంలో రిజిస్ట్రేషన్లు

(మిగతా 6వ పేజీలో..)





జొన్నలగడ్డ సొసైటీ భవనం

మరో ఆరు నెలలు.. అధికారుల పాలనే

- సహకార ఎన్నికలు లేవు
- ఉత్తర్వులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాలకు గతంలో నియమించిన పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 21 నుంచి పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితి ముగియనుండడంతో సొసైటీలకు ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరిగింది. ఒక వేళ ఎన్నికలు నిర్వహించకపోతే త్రిసభ్య కమిటీలను నామినేట్ చేస్తారని కూడా ప్రచారం చేశారు. వీటన్నిటికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెడుతూ పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ అయా జిల్లాల సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌లు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 168 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. రైతులు ఓటు ద్వారా వారికి నచ్చిన రైతులను సంఘాలకు ఎన్నుకోవాలి. రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. వీటన్నింటికి గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను ప్రభుత్వమే నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో సొసైటీలకు ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారులకే సొసైటీల పాలనను అప్పగించింది. దీనివలన కొంత రాజకీయ జోక్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు పాలకులు సాహసం చేయకపోవడానికి సొసైటీల ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉండటమేనన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సభ్యుల పేర్లు నమోదు చేశారన్న విమర్శలున్నాయి. వీటన్నింటిని సరిదిద్దిన తరువాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

- చైర్మన్‌గా పులుకూరి.. వైస్ చైర్మన్‌గా చక్రపాణి
- పీసీ పదవి రెండు.. మూడేళ్లుగా పంపిణీ
- రెండేళ్లు పులుకూరి.. మూడేళ్లు గోగినేని
- డెల్టాలోనూ.. చెరి సగం..!
- తొలి రెండేళ్లు మురళీధరరావు
- తదుపరి మూడేళ్లు సునీల్ చౌదరి

సాగర్ ప్రాజెక్టు కమిటీకి.. కూటమి అభ్యర్థుల ఖరారు



పులుకూరి కాంతారావు | ఉప్పలపాటి చక్రపాణి | గోగినేని కోటేశ్వరరావు

(నరసరావుపేట, బాపట్ల ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ కూటమి అభ్యర్థులను తెలుగుదేశం అధిష్ఠానం ఖరారు చేసింది. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నేడు జరగనున్న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగనున్నాయి. పీసీ పదవికి టీడీపీ నేతల మధ్య పోటీ ఏర్పడటంతో అధిష్ఠానం దృష్టి సారించింది. పదవులు ఆశిస్తున్న వారితో చర్చలు జరిపింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకొని శుక్రవారం పీసీ అభ్యర్థులను ఖరారు చేశారు. పోటీ ఉండటంతో ఐదేళ్ల పీసీ పదవిని రెండేళ్లు.. మూడేళ్లుగా పంపిణీ చేసింది. తొలుత రెండేళ్లు గురజాల నియోజకవర్గానికి చెందిన కారంపూడి డిస్ట్రిబూటరీ కమిటీ అధ్యక్షుడు పులుకూరి కాంతారావు పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. తదుపరి మూడేళ్లు సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముపాళ్ల డీసీ అధ్యక్షుడు గోగినేని కోటేశ్వరరావును ఖరారు చేశారు. ఈ మేరకు ఇద్దరి మధ్య అధిష్ఠానం సయోధ్య చేసింది. తొలుత తమ నియోజకవర్గానికే పీసీ పదవి కావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ పట్టు పట్టారు. ఇరువురి మధ్య పార్టీ అధిష్ఠానం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కాగా పల్నాడు జిల్లాకు చైర్మన్ పదవి కేటాయించగా, బాపట్ల జిల్లాకు వైస్ చైర్మన్ పదవిని అధిష్ఠానం కేటాయించింది. పర్చూరు నియోజవర్గానికి చెందిన కొనంకి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి పేరును ఖరారు చేశారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పీసీ ఎన్నికల కోసం జలవనరుల శాఖ ఏర్పాట్లు చేసింది. పీసీ పరిధిలో మొత్తం 48 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీరు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. అధిష్ఠానం పేర్లు ఖరారు చేయడంతో పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక లాంచనమే. పల్నాడు జిల్లాలో 25, గుంటూరు జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో 8, ప్రకాశం జిల్లా పరిధిలో 10 డీసీలు ఉన్నాయి.

డెల్టాలోనూ.. ఇద్దరికి

కృష్ణా వెస్ట్రన్ డెల్టా(కేడబ్ల్యూడీ) పరిధిలోని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక శనివారం జరగనుంది. ఈ పదవి విషయంలో అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. తొలి రేండేళ్లు రేపల్లె నియోజకవర్గానికి చెందిన పంతాని మురళీధరరావు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, తదుపరి మూడేళ్లు కాకుమాను మండలానికి చెందిన సునీల్ చౌదరి వ్యవహరించనున్నారు. ఇప్పటికే వీరి నియామకానికి సంబంధించి శుక్రవారం రాత్రికే జిల్లాకు చెందిన నేతలు ఏకాభిప్రాయానికి రాగా, శనివారం ఉదయం జరిగే ఎన్నిక ఏకగ్రీవం కానుందని సమాచారం. అమర్తలూరు మండల పరిధిలోని కూచిపూడి లాకుల వద్ద ఉన్న ఇరిగేషన్ శాఖ భవనం వేదిక కానుంది. ఇప్పటికే జిల్లా పరిధిలో ఉన్న 22 డీసీల పదవుల్లో కొలువుదీరిన వారికి శనివారం ఉదయం 7 గంటలకల్లా కూచినపూడి లాకుల వద్దకు చేరుకోవాలని ఇరిగేషన్ శాఖ సమాచారం ఇచ్చింది.

- అనుమతులపై స్పందించని నిర్వాహకులు
- అపశ్రుతులు లేకుండా చూడాలంటున్న స్థానికులు

తీరంలో వేడుకలకు.. రంగం సిద్ధం

చీరాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకలకు రాష్ట్రమంతా సిద్ధమవుతోంది. ఇదే క్రమంలో చీరాల రిసార్ట్స్ నిర్వాహకులు కూడా సంద ర్శకులను వివిధ ఆఫర్లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఒక్కో టిక్కెట్ ధర రూ.2వేలు నుండి రూ.4 వేల వరకు ఆయా రిసార్ట్స్, హోటల్స్ స్థాయిని బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. టికెట్ పొందిన వ్యక్తులకు మద్యం, స్నాక్స్, భోజనం కల్చరల్ ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని ప్రచారం చేస్తున్నారు. అయితే ఆయా కార్యక్రమాలకు అనుమతి తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారా లేదా అనే ప్రశ్నకు మాత్రం వారి నుంచి సమాధానం రావడం లేదని తెలుస్తోంది. చీరాల ప్రాంతంలో పలు రిసార్ట్‌ల ఎదురుగా ఉన్న సముద్రతీరంలో ఎలాంటి అనుమతులు లేకుండా తాగి ఊగే పార్టీలు జరుగుతున్నాయన్నది బహి రంగ రహస్యం. వీటిపై చర్య లు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు ఆవైపు కన్నెత్తి చూడరు. ఇదిలాఉంటే డిసెంబరు 31 రాత్రికి నూతన సంవత్సర వేడుకల పేరుతో పార్టీలు పెట్టి కాసులు దండుకునేందుకు పలు రిసార్ట్‌ల నిర్వాహకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎప్పటి మాదిరిగానే అనుమతులు లేకుండానే ఈవెంట్‌ల పేరుతో తమ దందా సాగిం చాలని ఉద్దేశంతో ముందుడుగులు వేస్తున్నట్లు సమాచారం.

పోలీస్, ఎక్సైజ్ అనుమతులు తప్పనిసరి

ప్రత్యేక ఈవెంట్‌ల పేరుతో నూతన సంవత్సర వేడుకలు జరపాలంటే ముందస్తుగా పోలీస్ అనుమతి తప్పనిసరి. మద్యం వినియోగానికి ఎక్సైజ్ అధికారులు నుండి అనుమతి పొందాలి. దీంతోపాటు నిబంధనలు మేరకు మాత్రమే అబ్కారీ శాఖ నుండి మద్యం కొనుగోలు చేయాలి. అంతే కాకుండా తీరంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ పేరుతో నిర్వహించే క్యాంపు ఫైర్ కుర్చీల ఆట ఇతర ప్రత్యేక కార్యక్రమాలపై పోలీస్‌లు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఈవెంట్‌కు హాజరయ్యే వ్యక్తులతో పాటు, ఇతరులు కూడా అది పబ్లిక్ ప్లేస్ అంటూ పాల్గొనే అవకాశం ఉంటుంది. వీటి దగ్గర గతంలో ఘర్షణలు జరిగిన సందర్భంకూడా ఉంది. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కనీసం ఈ ఏడాదైనా నిబంధనలు పాటించే విధంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. ఇప్పటికే తీరంలో జరిగిన అపశ్రుతులతో పలువురు ప్రాణాలు వదిలారు. నిర్వహించే ఈవెంట్‌లలో అపశ్రుతులు దొర్లకుండా ఉండాలంటే సంబంధిత అధికారుల నుంచి పక్కాగా అనుమతులు పొంది నిబంధనల మేరకు మాత్రమే ఆ ఈవెంట్‌లు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



అనుమతులు పొందాల్సిందే
- ఎండీ మోయిన్ డీఎస్పీ చీరాల

తీరంలో నిర్వహించే ఈవెంట్‌లకు ముందస్తుగా పోలీస్ అనుమతి తప్పనిసరి. నిబంధనలు మేరకు వారు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ముందస్తుగా అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు పొందాక మాత్రమే వారి కార్యకలాపాలు నిర్వహించుకోవాలి., లేకుంటే చర్యలు తప్పవు.

చలానా ద్వారా ఈవెంట్ అనుమతికి రుసుము చెల్లించాలి
- నాగేశ్వరరావు, ఎక్సైజ్ సిఐ చీరాల

నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ప్రత్యేక ఈవెంట్‌లు తీర ప్రాంతంలో నిర్వహించే ఎవరైనా ముందస్తుగా చలానా రూపేణా నిర్ణీత రుసుం చెల్లించి అనుమతి పొందాలి. ఈవెంట్‌లో వినియోగించే మద్యం అబ్కారీ శాఖ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఎన్‌డీపీ లిక్కర్ వినియోగం నేరం. భిన్నంగా వ్యహరిస్తే చర్యలు తప్పవు.

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమంపై దృష్టిపెట్టాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. బాపట్ల పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం సంక్షేమశాఖ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, గృహ సంక్షేమ, హాస్టల్, వైద్య, పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో పిల్లలు హింస, మానసిక వేధింపులకు గురికాకుండా ప్రత్యేకమైన నిఘా వ్యవస్థ పనిచేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వసతిగృహాలలో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటుచేయాలని, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అవసరమైన మౌలికసదుపాయాలు కల్పించి క్రమశిక్షణ కలిగిన విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా, లేబర్ ఆఫీసర్ శివలీల, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

ప్రక్షాళన దిశగా 'రిజిస్ట్రేషన్'...!

(5వ పేజీతరువాయి)
కూడా నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం చెబుతుండగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని రిజిస్ట్రేషన్ శాఖ చెప్పడం కొంత గందరగోళానికి దారి తీస్తోంది

నకిలీ వీలునామాలతో ఎంతోమందిని బాధితులుగా....

నకిలీ వీలునామాలు సృష్టించి ఎంతోమందిని ఆస్తి వివాదాలలోకి లాగి ఆపై వారే సెటిల్మెంట్ చేసే దందాలు గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగాయి. తమ అడుగులకు మడుగులొత్తే సబ్‌రిజిస్ట్రార్ల ద్వారా ఈ అడ్డగోలు వ్యవహారాలను వైసీపీ నేతాగణం పెద్ద ఎత్తున నడిపించింది. ఇలాంటి వాటికి గత ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల సంఖ్యే దాదాపు 180 వరకు ఉన్నాయంటే ఏరీతిన సదరు విభాగాన్ని భ్రష్టుపట్టించారో అవగతమవుతోంది. ఈ నకిలీ వీలునామాలపై వచ్చిన ఫిర్యాదులతో పాటు ఆ సమయంలో అక్కడ పనిచేసిన వారి వివరాలు, వాటిలో సహేతుకత ఎంత అని తేల్చే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమయి ఉంది. ఇది పారదర్శకంగా జరిగితే ఎంతో మంది బాధితులకు ఊరట చేకూరడంతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ ప్రక్షాళనలో గొప్ప అడుగుకు శ్రీకారం చుట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది

ఈ-స్టాంపింగ్ విధానంపై పునరాలోచన....

కొన్ని దశాబ్దాలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతరత్రా వ్యవహారాలకు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోంది. గత ప్రభుత్వం వాటిని తెప్పించలేని దురవస్థలో ఈ -స్టాంపింగ్ అంటూ కొత్త పల్లవి ఎత్తుకుని ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసింది. ఈ విధానంపై అప్పట్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చినా అప్పటి ప్రభుత్వం ఖాతరు చేయకపోగా మొండిగా ముందుకే వెళ్లింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాత విధానాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది కాకపోతే ఇస్టాంపింగ్ రద్దుపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

మార్కెట్ విలువ పెంపులో ఏకపక్షంగా....

రిజిస్ట్రేషన్ శాఖను కేవలం ఆదాయ వనరుగానే చూసిన గత ప్రభుత్వం ఎక్కడా పారదర్శకతకు అవకాశం లేకుండా ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యమిచ్చింది. దీనిలో భాగంగానే భూముల, భవనాల విలువను బహిరంగమార్కెట్‌కంటే రెండుమూడు రెట్లు అమాంతం పెంచి ప్రజల నడ్డి విరిచింది. ఈ రూపేణా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖకు దక్కిన అదనపు ఆదాయం అక్షరాల రూ.250 కోట్లకు పైమాటే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచే ఆలోచన చేస్తుంది. కాకపోతే సవరించిన విలువలను సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయంలోని నోటీసు బోర్డుల్లో రెండు వారాల పాటు ఉంచి ప్రజల అభిప్రాయం కూడా తీసుకెళ్లాలన్న తలంపులో కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. మార్కెట్ విలువ పెంపుపై ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలకు కూడా తగు ప్రాధాన్యమిచ్చి నిర్ణయం తీసుకోవాలని ప్రభుతత్వం భావిస్తోంది

అవినీతి కూపాలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు...

ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో ఏ ఒక్క వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ అవినీతికి కేరాఫ్‌గా మారాయి. వీటిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అయితే ఈ అవినీతి చిట్టాలకు అంతే ఉండదు. ఏసీబీ దాడుల్లో ఎక్కువ శాతం పట్టుబడేది రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులే కావడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఏసీబీ కోరలు కూడా దాదాపుగా పీకేసి మొక్కుబడి సోదాలు తప్ప చిత్తశుద్ధితో పనిచేసిన దాఖలాలు లేవు. గడచిన ఐదు సంవత్సరాల వ్యవధిలో ఏసీబీ దాడుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పట్టుబడిన రిజిస్ట్రేషన్ సిబ్బంది 15కులోపుగానే ఉండడం ఏసీబీ అధ్వాన పనితీరుకు అద్దం పడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని భావిస్తోంది. దానిలో భాగంగా తొలుత ఆయా కార్యాలయాల్లో ఉన్న అవినీతి తిమింగలాల జాబితాను తయారు చేసే పనిలో ఉంది. త్వరలోనే వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించడంతో పాటు సిబ్బంది విషయంలో కూడా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టనుంది.

ఆర్టీసీలో డోర్ డెలివరీ సేవలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 20: ఆంధ్రజ్యోతి: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీసేవలను విజయవంతం చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురు గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. కార్గో డోర్ డెలివరీ ద్వారా డిపోకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీ చేస్తారన్నారు. ఉద్యోగులు బాధ్యతతో డోర్ డెలివరీ బుకింగ్ చేయాలన్నారు.

భూభారం!



- పెరగనున్న భూముల విలువలు
- బహిరంగ మార్కెట్‌కు సమాంతరంగా ధరలు
- వచ్చేనెల 1 నుంచి అమలు
- గ్రామీణ ప్రాంతాలలో 20శాతం
- పట్టణ ప్రాంతాలలో 5శాతం వరకు పెంపు
- పెంచవద్దంటున్న ప్రజాప్రతినిధులు
- ఇక నుంచి భారంకానున్న రిజిస్ట్రేషన్లు
- ఇప్పటికే పడిపోయిన రియల్ రంగం

జనంపై మరో భారం పడనుంది. సాధారణ రివిజన్‌లో భాగంగా భూముల విలువలను ప్రభుత్వం పెంచబోతుంది. వచ్చేనెల 1 నుంచి అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూముల విలువలను పరిగణనలోకి తీసుకుని రివిజన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇప్పటికే రెవెన్యూ అధికారుల నుంచి కమర్షియల్ భూములుగా మార్పుచేసిన వాటి వివరాలు తెప్పించుకొని సబ్‌రిజిస్ట్రార్లు ప్రాథమిక నివేదికలు తయారుచేశారు. పట్టణ ప్రాంతాలలో 5శాతం, గ్రామీణ ప్రాంతాలలో 20శాతం భూముల విలువ పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ చార్జీలపై పడనుంది.

ఒంగోలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువకు సమాంతరంగా ఉండాలనే ఆలోచనతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ముసాయిదాను సిద్ధం చేశారు. అందుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న భూముల మార్కెట్ విలువల కమిటీ పలుమార్లు సమావేశమైంది. ఈమేరకు 5శాతం నుంచి 20శాతం వరకు విలువలు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి భూముల విలువను రివిజన్ చేస్తారు అయితే 2019 సాధారణ రివిజన్ జరిగింది. 2020లో పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు 20శాతం పెంచారు. 2023లో స్పెషల్ రివిజన్ పేరుతో పట్టణ, మండలకేంద్రాలతోపాటుగా ముఖ్యమైన గ్రామాలలో కూడా భూముల ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఇప్పటికే కుదేలైన రియల్ రంగం

మరలా ఈ ఏడాది సాధారణ రివిజన్ పేరుతో భూముల ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ మేరకు అధికారయంత్రాగం కసరత్తు చేపట్టింది. అయితే ప్రజాప్రతినిధుల నుంచి మాత్రం ధరలు పెంచవద్దని వినతులు అందుతున్నాయి. గిద్దలూరు ఎమ్మెల్యే భూముల విలువ పెంచవద్దని రిజిస్ట్రేషన్ అధికారులకు లేఖ రాశారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. గత రెండేళ్లుగా భూముల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పడిపోయాయి. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 50శాతానికి రిజిస్ట్రేషన్ దస్తావేజుల సంఖ్య పడిపోయింది. జిల్లాలో ఈ ఏడాది రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.502 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా ఇప్పటికి రూ.242 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే 50శాతం కూడా పూర్తి కాలేదు. ఆదాయం తగ్గడానికి రియల్ రంగం దెబ్బతినడమే కారణమని రిజిస్ట్రేషన్ అధికారులే అంటున్నారు. ఈ నేపథ్యంలో భూములు విలువ పెంచడం వలన రిజిస్ట్రేషన్లు మరింత తగ్గుతాయని రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లో 5, గ్రామీణంలో 20శాతం పెరిగే అవకాశం

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో భూముల విలువ భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాలలో 5 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 20శాతం భూముల విలువ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూముల విలువ పెరిగితే అదేస్థాయిలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయి. అలాగే జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులు పక్కన ఉన్న భూముల విలువ పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో కూడా స్వల్పంగా పెంచాలని ప్రాథమికంగా నివేదికలు సిద్ధం చేశారు. ఒంగోలు నగరంతోపాటుగా నగర పంచాయతీలు, మండలకేంద్రాలు, ముఖ్యమైన గ్రామాలలో భూములు విలువ పెరగనున్నాయి. అందుకు సంబంధించి జిల్లా కమిటీలో చర్చించి భూముల విలువ పెంచనున్నారు.

24 వరకు అభ్యంతరాలు తెలియజేయవచ్చు: జిల్లా రిజిస్ట్రార్

జిల్లాలో సాధారణ రివిజన్ మేరకు భూముల విలువలు పెంచనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ళ బాలాంజనేయులు తెలిపారు. పెంచిన భూముల ధరలను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ఐజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 24లోపు ఆధారాలతో తెలియజేయాలని కోరారు. 26న జిల్లా కమిటీ సమావేశమై తిరిగి పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటుందన్నారు. వచ్చేనెల 1 నుంచి రివిజన్ చేసిన ధరలు అమలులోకి వస్తాయన్నారు.

రిజిస్ట్రేషన్ అధికారులు సిద్ధం చేసిన ముసాయిదా ఇలా..

- లాయర్‌పేటలో గజం రూ.29వేలు ఉండగా రూ.30వేలు
- కొండయ్య బంకు వీధిలో గజం రూ.22వేలు కాగా రూ.24వేలు
- రాజపానగల్ రోడ్డులో ప్రస్తుతం రూ.30వేలు కాగా రూ.32వేలు
- పెళ్ళూరు కోటవీధిలో రూ.5,400 కాగా రూ. 6వేలకు పెంచేందుకు సిద్ధమయ్యారు.
- ముక్తినూతలపాడులో ఎకరా రూ.40లక్షలు కాగా రూ.42 లక్షలు
- కొత్తపట్నం మండలం అల్లూరులో ఎకరా రూ.9లక్షలు ఉండగా రూ.10లక్షలు
- యరజర్లలో రూ.5.5లక్షలు ఉండగా రూ.6లక్షలు
- మామిడిపాలెంలో రూ.37 లక్షలు ఉండగా రూ.39 లక్షలు
- కంభం టౌన్‌లో గజం రూ.6వేలు కాగా రూ.6200లకు పెంచుతారు
- కంభం ప్రాంతంలో ఎకరం రూ.1.10లక్షలు కాగా రూ1.20 లక్షలు పెంచేందుకు ప్రాథమికంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా మార్కెట్ విలువల కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. బుధ, గురువారాలు జాయింట్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అవసరమైన చోట మాత్రమే ధరలు పెంచాలని సూచనలు చేశారు. అందుకనుగుణంగా మార్పులు చేర్పులు చేసున్నారు.

అగ్రీ పరీక్షలు.. అంతంతమాత్రమే

(5వ పేజీతరువాయి)
సామర్థ్యం పరీక్షల పై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఏఓ చెయ్యాల్సిన పరీక్షలను ఏఈఓలతో చేయించి తూతూమంత్రంగా రిపోర్ట్‌లు ఇస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. పరీక్షలు ఏఈఓలు నిర్వహించి, రిపోర్ట్ మాత్రం ఏఓ పేరుతో ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని అంటున్నారు.

వృథా ప్రయాస...

ల్యాబుల్లో లర్హత కలిగిన అధికారులను నియమించకపోవటం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయిలో చేస్తున్న తనిఖీలు కూడా అభాసు పాలవుతున్నాయి. వాస్తవానికి ప్రతి వ్యవసాయ శాఖ అధికారి వారి పరిధిలో ప్రతి నెలా విత్తనాలు, ఎరువులకు సంబంధించి కొన్ని నమూనాలు సేకరించాలి. సేకరించిన నమూనాలను మొదట రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడ వాటిని డీకోడ్ చేసి నియోజకవర్గ పరిధిలోని ల్యాబులకు పంపుతున్నారు.ఇక్కడ వాటికి పరీక్షలు నిర్వహించి మంచివి అని నిర్ధారిస్తేనే అమ్మకాలు జరుగుతాయి. అటువంటి కీలకమైన నిర్ధారిత పరీక్షలు కింది స్థాయి సిబ్బంది తో చేయించటం విమర్శలకు తావిస్తోంది.

మొలవక పోయినా మంచివనే రిపోర్ట్

ఈ మధ్య కాలంలో నకిలీ విత్తనాలు బెడద బాగా పెరిగిపోయింది. అటువంటప్పుడు కొన్ని విత్తనాల కంపెనీలపై అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. విచిత్రంగా ల్యాబ్ పరీక్షల్లో అవి మంచివని తేలుతుంది. ఇటువంటి రిపోర్ట్ లపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. సరైన అవగాహన లేకుండానే కింది స్థాయి సిబ్బంది తో పరీక్షలు నిర్వహించి మొక్కుబడిగా రిపోర్ట్ ు ఇస్తున్నారు. కొన్ని పెద్ద కంపెనీలు నమూనాలు ఎక్కడికి వెళ్లాయో తెలుసుకొని కింది స్థాయి సిబ్బంది ద్వారా అనుకూలంగా రిపోర్టు లు తెప్పించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరీక్ష లపై శిక్షణ కూడా లేదు...

వాస్తవానికి ఒక వేళ ఏఈఓ లతో ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని భావిస్తే వారికి ముందుగా శిక్షణ ఇవ్వాలి. గత మూడేళ్ళుగా ఉమ్మడి జిల్లాలో అటువంటి శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించలేదు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకోసం వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం ధాన్యం సేకరణపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వర్షాల నుంచి పంట ఉత్పత్తులను రైతులు కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టలను అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని అధికారులు మరింత చురుకుగా వ్యవహరిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత? ఇప్పటివరకు ఎంత మోతాదులో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చారు. ఇంకెంత రావాల్సి ఉందనే అంశాలపై అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. అంతకు ముందు సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును వివరించారు. ఈ నెల రెండోవారం నాటికి 216, మూడవ వారానికి 564 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు .ఇప్పటివరకు రూ.1.41 కోట్ల నగదును రైతుల ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రేషన్ దుకాణాల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులను జనవరి 15 నాటికి భర్తీచేయాలన్నారు. రేషన్ బియ్యానికి సంబంధించిన అక్రమాలపై 6(ఏ) కేసులు నమోదు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బియ్యం పక్కదారి పట్టకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడే రైస్‌మిల్లులు, వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పద్మశ్రీ, శ్రీనివాసరావు, గోపిచంద్, రమణ, ఉపేంద్ర, సుభాషిణి పాల్గొన్నారు.

ఆ వైద్యాధికారికి అందలం

- మహిళా ఉద్యోగులను వేధించడంతో సరెండర్
- ఆ వెంటనే పైస్థాయిలో వ్యవహారం
- నడిపి మళ్లీ జిల్లాకే
- జిల్లాకేంద్ర కార్యాలయంలో
- అన్నీతానై నడుపుతున్న వైనం
- కూటమి ప్రభుత్వం వచ్చినా వైద్యశాఖ
- ఉన్నతాధికారుల్లో రాని మార్పు

ఒంగోలుకలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి. తన వద్ద పనిచేసే మహిళా ఉద్యోగులపై కన్నేస్తారు. వారు చెప్పినట్లు వినకపోతే వేధింపులకు పాల్పడుతారు. ఆ వేధింపులు భరించలేని ఆ మహిళా ఉద్యోగులు అందరూ ఒక్కటై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన అధికారులు ఆ వైద్యాధికారి చేస్తున్న వికృత చేష్టలు నిజమేనని తేల్చి గట్టుచప్పుడు కాకుండా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ కార్యాలయానికి సరెండర్ చేశారు. సాధారణంగా అటువంటి డాక్టర్ చేస్తున్న వికృత క్రీడలను బయటకు రాకుండా మామూళ్లు తీసుకొని ఆ శాఖ అధికారులు కాపాడుకుంటూ వస్తున్నారు. ఇదీ పశ్చిమ ప్రాంతంలోని ఒక మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో జరిగిన వ్యవహారం. కానీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఏమి జరిగిందో తెలియదు కానీ వారంరోజుల్లోనే తిరిగి వైద్య ఆరోగశాఖకు ఆ డాక్టర్‌ను డిప్యుటేషన్ వేశారు. వాస్తవంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటే కనీసం మరొక జిల్లాలో నియమిస్తారు. కానీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఆ వైద్యాధికారి తన పలుకబడిని చూపి వారంరోజులు తిరగకముందే జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వచ్చి వాలిపోయారు.

శాఖలో తిష్ట వేసి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆయన వైద్యశాఖలో అనధికారింగా విధులు నిర్వహించి ప్రైవేటు వైద్యశాలలకు అనుమతులు ఇచ్చేందుకు భారీగా మామూళ్ల వసూలు చేశారనే ఆరోపణలు వైద్యాధికారిపై ఉన్నాయి. అటువంటి వ్యక్తి ఇప్పుడు వైద్యశాఖలోనే తిష్ట వేశారు. పని కోసం వచ్చే ఉద్యోగులతో మాట్లాడి అంతా తాను చూస్తానంటూ సంబంధిత శాఖ ఉన్నతాధికారి వద్దకు తనే స్వయంగా తీసుకొని వెళ్తున్నారు. ఆ వైద్యశాఖ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ ఉద్యోగులకు తెలియని అంశాలు కూడా ఆయన వద్ద ఉన్నాయంటే వైద్యశాఖ పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రభుత్వ శాఖలను ఇప్పటికే ప్రక్షాళన చేసింది. కానీ వైద్యశాఖను మాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. గత పది నెలల నుంచి రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో ఇన్‌చార్జీల పాలన జరుగుతుండటంతో ఆ కార్యాలయంలో ఏమి జరుగుతుందో ఏమి తెలియడం లేదు. ఇక్కడ ఏదైనా జరిగితే పైస్థాయిలో తమకు అండదండలు అందించే ఒక అధికారి ఉండటంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకంలో అడ్డగోలుగా వ్యవహరించిన సమయంలో జిల్లా కార్యాలయంలోనే పనిచేసిన ఆ అధికారి ఇప్పుడు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆఫీసులో కీలక స్థానంలో ఉన్నారు. దీంతో తమకు ఏమి కాదన్న ఉద్దేశంతో అలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఇప్పటికైనా కలెక్టర్‌తో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వైద్యశాఖను ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులు కోరుతున్నారు.



అవీఇవీ

టీడీపీ నేతలను పరామర్శించిన మంత్రి


జేవీపాలెంలో టీడీపీ నేత రాధాకృష్ణమూర్తిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలువురు టీడీపీ నేతలను పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు తెలగతోటి రాధాకృష్ణమూర్తిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ నాయకులు ధూళిపాళ్ల సుబ్బరావును పరామర్శించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ భర్త, టీడీపీ నేత జాగర్లమూడి వాయునందనరావు నివాసంలో వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట టీడీపీ మండల నాయకులు కె.వి.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, స్థానిక నేత జాగర్లమూడి శ్రీనివాసరావు, గరిమిడి జగన్, అమృతపూడి ఏసోబు, గురుబాబు. శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు, కబడ్డీ అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలి


ఎంపికైన జిల్లా బాలుర జట్టుతో అసోసియేషన్ నేతలు

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోటీలలో బాగా ఆడి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు, కబడ్డీ అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వై.పూర్ణ చంద్రరావు, ఉపాధ్యక్షులు ప్రసాద్‌లు అన్నారు. స్థానిక మాగుంట సుబ్బ రామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టును శుక్రవారం వారు ఎంపిక చేశారు. జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టుకు ఈ నెల 15వ తేదీన 16 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి, ఈ నెల 16 తేదీ నుంచి 20వ తేదీ వరకు వారికి శిక్షణ ఇచ్చినట్లు పూర్ణచంద్రరావు తెలిపారు. 16 మంది ప్రాబబుల్స్‌లో ప్రతిభ చూసిన 12 మందిని తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే 50వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలుర, బాలికల టోర్నమెంట్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి రమేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఆట్ల స్వామిరెడ్డి, ముసలారెడ్డి, పల్లపట్ల పోలారెడ్డి, భోగిరెడ్డి నాగాంజనేయులురెడ్డి, శివారెడ్డి, కోట చక్రధర్‌రెడ్డి, నిద్ర శ్రీనివాసరెడ్డి, వాటంబాటి రాజేష్, పిట్టు బాలకృష్ణారెడ్డి, దేశం సుబ్బారెడ్డి, కోచ్ ఎం.గిరిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర కబడ్డీ జట్టు వివరాలు

ఎస్.మణిరెడ్డి(కెప్టెన్) మూలగానివారిపాలెం, జి.రామకృష్ణ, జి.లక్ష్మణ్, జి.బాలజీ, డి.వి.మాధవ్(మూలగానివారిపాలెం), ఎ.అశోక్, బి.భవానీశేఖర్(మున్నంవారిపాలెం), కే.సాయిరామ్(కొత్తపట్నం),జి.మల్లిఖార్జునరెడ్డి(రాజుబంగారుపాలెం), ఎం.సోమేష్(వాడరేవు), కే.ఆకాష్(గొట్లగట్టు), ఎ.వెంకీ(నంతమాగులూరు), మేనేజర్ పి.బాలకృష్ణారెడ్డి, కోచ్ గిరిబాబులు ఉన్నారు.

పోలీసు ఆసుపత్రికి భూమిపూజ

ఒంగోలు క్రైం, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఆసుపత్రికి ఎస్పీ ఏఆర్ .దామోదర్ భూమిపూజ నిర్వహిచారు. శుక్రవారం కిమ్స్ హస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేయనున్న ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులకు నిత్యం వైద్యసేవలు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సిబ్బంది తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, కిమ్స్ హస్పిటల్ డైరెక్టర్ టి.గిరినాయుడు, సీఈవో కె.అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ భానుమతి, హౌసింగ్ బోర్డు ఈఈ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను కనిగిరి డీఎస్పీ మహేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన కనిగిరి డీఎస్పీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీని కలిసి కనిగిరి సబ్ డివిజన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మద్దిపాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో దొడ్డవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మోరబోయిన పాపారావు(30) కరెంటు పనులు చేస్తుంటాడు. తన పొలంలో నీరు పెట్టేందుకు గట్టున ఉన్న మోటార్‌ను రిపేర్ చేస్తుండగా షాక్ తగిలి చెరువులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చెరువులో దూకిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

టంగుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ విషయాలపై సోదరితో గొడవపడి చెరువులోకి దూకిన వ్యక్తిని హెడ్ కానిస్టేబుల్ రక్షించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చెల్లెమ్మతోటకు చెందిన మిరియాల సాయికుమార్, ఆయన అక్క వల్లూరమ్మ పోలీసు స్టేషన్ ఎదురుగా ఊరచెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ వద్దకు గురువారంరాత్రి వచ్చారు. అక్కడ వారిద్దరూ గొడవపడ్డారు.మనస్తాపం చెందిన సాయికుమార్ ఊరచెరువులో దూకాడు. అక్క వల్లూరమ్మ పెద్దగా కేకలు వేయడంతో స్టేషన్‌లో ఉన్న పోలీసులంతా పరుగున అక్కడికి చేరుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రావు చెరువులోకి దూకి మునిగిపోతున్న సాయికుమార్‌ను బయటకు తీసి రక్షించారు. వెంకట్రావును ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ఐ నాగమల్లీశ్వరరావు అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో జరిగిన దాడి ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఒంగోలు స్పెషల్ జేఎఫ్‌సీఎం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి కోమలివల్లి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన మర్రావుల సుబ్బారావుకు చెందిన స్థలంలో ఇల్లు నిర్మించుకొనేందుకు ఆయన కుటుంబ సభ్యులు 2018లో గుంతలు తవ్వుతుండగా అదే గ్రామానికి చెందిన మర్రావుల శ్రీనివాసరావు, అతని భార్య పార్వతి, వారి కుమార్తె నాగలక్ష్మిలు కలిసి సుబ్బారావుపై కర్రతో దాడి చేశారు. ఆయన భార్య అడ్డుకోగా ఆమెను కొట్టి గాయపరచారు. బాధితులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నాటి ఏఎస్ఐ దేవదానం కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ బాజీ నాగేంద్రప్రసాద్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆ కేసులో సాక్షులను కోర్టులో హాజరు పరచారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుజాత వాదించారు. దాంతో నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడిగా ఉన్న మర్రావుల శ్రీనివాసరావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.7వేల జరిమానా, ఏ2, ఏ3 నిందితురాళ్లకు రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాగులుప్పలపాడు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

అవీ..ఇవీ



ప్రశంసాపత్రం అందుకుంటున్న కొండమంజులూరు పాఠశాల విద్యార్థి పవన్ గోపీకృష్ణ

రాష్ట్రస్థాయి పోటీలకు కొండమంజులూరు విద్యార్థులు

పంగులూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వం పోటీలలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలలో కొండమంజులూరు పాఠశాల 8వ తరగతి విద్యార్థి పవన్ గోపీకృష్ణ వ్యాసరచనలోను, 9వ తరగతి విద్యార్థి కప్పెర జాన్‌బాబు వక్తృత్వపు పోటీలో ప్రథమస్థానంలో నిలిచారు. వీరు ఈనెల 23న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం అనిత తెలిపారు. శుక్రవారం జిల్లా సైన్స్ అధికారి సాదిక్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, రావుల వెంకటనరసింహారావు, చింతల సహదేవుడు, ప్రధాన దాత బొప్పూడి నాగేశ్వరరావు, హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు అభినందించారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

సమాచార దరఖాస్తులకు సకాలంలో జావాబు ఇవ్వాలి

బల్లికురవ. డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా వివరాల దరఖాస్తులు చేస్తే వారికి నిర్ణీత సమయంలో జావాబు ఇవ్వాలని ఎంపీడీవో కె. కుసుమకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టాలన్నారు. అలానే గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చుపాలన్నారు. అలానే వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇంటింటా చేస్తున్న సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.



తూర్పు తక్కెళ్లపాడులో భూ సమస్యపై రైతులు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పంగులూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని మండల తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.గ్రామంలోని ఎస్‌టీ కాలనీలో పర్యటించి ఆధార్, రేషన్ కార్డులు, నివేశన స్థల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బి.సురేష్, పచ్చా శ్రీనివాసరావు, జగర్లమూడి భాను ప్రకాష్, పిచ్చిరెడ్డి, స్థానిక రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 55 అర్జీలు

చినగంజాం : మండలంలోని నీలాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 55 అర్జీలు అందినట్లు తహసీల్దార్ జె.ప్రభాకరావు తెలిపారు. ఈ సదస్సులో మ్యూటేషన్ కోసం 20, ఎఫ్ లైన్ కొరకు 21, తప్పుల సవరణకు 5, ప్రత్యామ్నాయం కోసం 1, 1బి అడంగల్ కోసం 6, డిజిటల్ సంతకం కోసం2 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామాక్షికేర్ హాస్పిటల్స్ ఎండీ దేవరాజ్

ప్రేమ, త్యాగంతో వైద్య సేవలు అందించాలి

చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు వలె ప్రేమ, త్యాగంతో వైద్య సేవలు అందించాలని శ్రీకామాక్షికేర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. స్థానిక దండుబాటలోని నర్సింగ్ ఆఫ్ కాలేజ్‌లో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా దేవరాజ్ కేక్ కట్‌చేసి నిర్వహించి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ చవ్వా దుర్గారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపల్ దివ్య, నెహెమియా, కళ్యాణి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు

50 మంది పేద మహిళలకు చీరల పంపిణీ

అద్దంకిటౌన్: క్రీస్తు బోధనలు అందరూ అచరించదగినవి అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పసుమర్తిపాలెంలోని డాక్టర్ క్లౌవ్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో విశ్రాంత తహసీల్దార్ తాతా బాలసుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో 50 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీ సుధాకరరావు, ఏజీ మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

అద్దంలా రోడ్లు - అధ్వానంగా మార్జిన్‌లు

చెన్నుపల్లి - అనంతవరం, వేమవరం - తాతపూడి రహదారులు అస్తవ్యస్తం

ఎదురెదురుగా వాహనాలు వస్తే అంతేసంగతులు

వాహన చోదకులు పడరాని పాట్లు

నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే దారులను పట్టించుకోని అధికారులు



వేమవరం - మురికిపూడి గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు మార్జిన్‌లు

బల్లికురవ. డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే చెన్నుపల్లి-అనంతవరం రోడ్డులో మార్జిన్ కష్టాలను వాహనచోదకులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మాత్రం బాగున్నా మార్జిన్ గోతులతో నిండి ఉంది. దీంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్లికురవ మండల పరిధిలోని చెన్నుపల్లి- అనంతవరం అర్అండ్‌బీ రోడ్డులో ఉన్న వేమవరం, మురికిపూడి, తాతపూడి గ్రామాల మధ్య తారు రోడ్డు సైడు మార్జిన్ అధ్వానంగా తయారయింది. ఈ రోడ్డునుంచి నిత్యం వందలాది గ్రానైట్ వాహనాలు, ప్రజలు నేషనల్ హైవేకు వెళతుంటారు. ఈ రోడ్డును గతంలోనే కొంత భాగం డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయగా కొంతభాగం సింగిల్ రోడ్డుకు తారు వేశారు. అయితే మార్జిన్‌లు మాత్రం చేపట్టలేదు. దీంతో వాహనాలు రోడ్డు దిగితే దిగబడి పోతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే వేమవరం నుంచి తాతపూడి వరకు ఉన్న రోడ్డు మార్జిన్‌లను అభివృద్ధి పరచాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌లు లేకపోవటంతో వేమవరం - తాతపూడి గ్రామాల మధ్య ట్రాఫిక్ ఇక్కట్లు

శరవేగంగా రాతి మండపం నిర్మాణం

మరో రెండు నెలల్లో పూర్తి చేసే దిశగా చర్యలు

అద్దంకి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి మండపం నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయి. సుమారు 6 కోట్ల రూపాయలతో రాతి ముఖమండపం నిర్మాణం రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమయ్యింది. 2 కోట్ల రూపాయలు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు, మరో 2 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, మిగిలిన 2 కోట్ల రూపాయలు దాతల సహకారంతో పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మందకొడిగా సాగిన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈవోగా తిమ్మానాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత పనులు వేగవంతం అయ్యాయి. ఇప్పటికే అత్యధిక శాతం నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. మార్చి నెలలో శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల వార్షిక తిరునాళ్ల జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెలలోనే రాతి మండపం నిర్మాణం పనులు పూర్తి చేసే దిశగా పనులు వేగవంతం చేశారు. అదే సమయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠకు కూడా పనులు ప్రారంభించారు. అన్ని పనులు పూర్తయిన తరువాత శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రస్తుతం బాలాలయంలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన విగ్రహం వద్ద పూజలు జరుగుతుండగా, నిర్మాణ పనులు పూర్తయిన తరువాత పాత ఆలయంలో పూజలు, అభిషేకాలు పునః ప్రారంభించే దిశగా అధికారులు పనులు చేయిస్తున్నారు. రాతి మండపానికి మూడు వైపులా ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు.



శింగరకొండలో అత్యధిక భాగం పూర్తయిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం



నిర్మాణం పూర్తయిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ మండపం ద్వారం

నేర నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

● ఎస్పీ తుషార్ డూడీ

● చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



చీరాల వన్‌టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణలో సిబ్బంది నిర్లక్ష్యంగా కూడదని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. శుక్రవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలు, కేసులకు సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. సిబ్బందితో సుదీర్ఘంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల చీరాల పరిధిలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఒంటరి మహిళల వివరాలు సేకరించి, పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. వారి పరిసరాల్లో సీసీకెమెరా నిఘా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పరిసరాల్లో అనుమానితుల వివరాలు స్టేషన్‌కు అందించి సహకరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎండీ మోయిన్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

కారంచేడు(పర్చూరు) : నేరాలు నియంత్రించటంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. శుక్రవారం కారంచేడు పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్ పరిశరాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీచేసి స్థానిక ఎస్సైకి తగిన సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందుపరుస్తూ సక్రమంగా రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో జరిగే నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, విధులు తదితర అంశాల గురించి, అలాగే ప్రతి ఒక్కరి వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య ఎస్సై వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ఐక్యవేదిక సభ్యుల నిరసన



అద్దంకిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వేదిక సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాలను పట్టుకుని నినాదాలు చేస్తు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ఐ క్యవేదిక ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అంకం నాగరాజు, దేవపాలన, చంద్రమౌళి, బాబురావు, కాంతారావు, జోషప్, యోహాన్, రోశయ్య సుదర్శన్, ప్రభాకరరావు, హనుమంతరావు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో..

మార్టూరు : అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని సమతా సైనిక్ దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మార్టూరు నేతాజీ నగర్, నేతాజీ నగర్ బొమ్మల సెంటర్‌లో సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



రోటరీ అధ్వర్యంలో అందిస్తున్న కుట్టుమిషన్లు

ఇంకొల్లు,డిసెంబరు 20,(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇంకొల్లు సెంట్రల్ రోటరీక్లబ్ తమ వంతు కృషి చేస్తూ ముందుకు సాగుతోందని ఆక్లబ్ అధ్యక్షులు షేక్ రఫీ అన్నారు.స్థానిక రోటరీ భవనంలో శుక్రవారం 11 మంది పేదమహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, జెట్టి స్వామి, పులఖండం బద్రిరెడ్డి, హన్ను, నిమ్మగడ్డ హనుమంతరావు, మహిళలు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 22వ తేదీ ఉదయం 8గంటల నుంచి జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల, మహిళల 10 కిలోమీటర్లు, అండర్-20 విభాగంలో బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీటర్లు, అండర్-18 విభాగంలో బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్లు, అండర్-16 విభాగంలో బాలురకు 2కిలోమీటర్లు, బాలికలకు 2 కిలోమీటర్లు క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో 1, 2, 3 స్థానాలు సాధించిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అంజేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తప్పనిసరని తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటలకు పోటీలు జరిగే ప్రదేశంలో అథ్లెటిక్స్ రిపోర్టు చేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు7997005087, 8978482329 సెల్ నెంబర్లను సంప్రదించాలని వెంకటరెడ్డి కోరారు.

కొత్తపేట శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

కొత్తపేట(చీరాలటౌన్), డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక కొత్తపేట శ్మశానవాటిక అభివృద్ధికి కొత్తపేట ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.లక్ష నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసబాబు, గోవర్ధన్, మాధవరావు, కోటేశ్వరరావ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి రవికుమార్

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

● మంత్రి రవికుమార్

అద్దంకి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలతో వైద్యం చేయించుకున్న 111 మందికి 1,26,71,093 రూపాయల చెక్కులు, 6 గురుకి 29.80 లక్షల రూపాయల ఎన్‌వోసీ పత్రాలు శుక్రవారం మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో 201 మందికి 2.26 కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 39 మందికి 1.42 కోట్ల రూపాయల ఎన్‌వోసీలు అందజేశామన్నారు.

రూ.2.60 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో కమ్యూనిటీ భవనాలు

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద సామాజిక బాధ్యతగా అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా సుమారు 2.60 కోట్ల రూపాయలతో ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీలలో 11 కమ్యూనిటీ భవనాలను, ఒక కళాశాల లో భోజనశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కమ్యూనిటీ భవనాలను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, కాకాని అశోక్, చిన్ని శ్రీనివాసరావు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీ వైస్‌చైర్మన్ పేరయ్య

బల్లికురవ : బల్లికురవ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికకావటంతో పాటు అద్దంకి డీసీ కమిటీలో వైస్ చైర్మన్‌గా అయిన కోయ పేరయ్య, నక్కబొక్కలపాడు నీటి సంఘం అధ్యక్షుడు దర్శి రామస్వామిలు శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా నీటి సంఘాల అధ్యక్షులు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదవిద్యార్థినికి లాప్‌ట్యాప్ అందజేత

ఇంకొల్లు,డిసెంబరు 20,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసపాడుకు చెందిన ఘంటా నాగభూషణం,వంకాయలపాటి శివరామకృష్ణయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సహకారంతో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు ప్రతిభ కలిగిన పేద విద్యార్థిని కొమరనేని గౌతమికి ల్యాప్‌ట్యాప్ అందించారు. ఈ కార్యక్రమంలో మండవసహదేవరావు, ఘంటా బాబు, కరణం పూర్ణచంద్రరావు, యార్లగడ్డ రామకృష్ణ, కరణం రమేష్, నూది సుబ్బారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో సైక్లిస్టుకు తీవ్ర గాయాలు



రోడ్డుపై అపస్మారక స్థితిలో ఉన్న యువకుడు

చీరాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముందు ఉన్న ఆటోను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం, సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ఘటనలో సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. అందిన వివరాల ప్రకారం.. స్థానిక జాన్‌పేటకు చెందిన కొర్రైపాటి ప్రభుకుమార్ అలియాస్ తల్లులు సైకిల్‌పై ఇంటి నుంచి పేరాలకు వస్తున్నాడు. ఈక్రమంలో కారంచేడు రైల్వే గేటు సమీపంకు రాగానే ఎదురుగా ద్విచక్ర వాహనం, ఆటో వస్తున్నాయి. ఆటోను తప్పించుకునే క్రమంలో ద్విచక్రవాహనం, సైకిలుఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన సైకిలిస్టును స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వేడి పాలు మీద పడి విద్యార్థికి గాయాలు

చీరాలటౌన్ : వేడిపాలు మీదపడి విద్యార్థితీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన చినగంజాంలోని హార్ప్ ప్రయివేట్ హాస్టల్లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. హాస్టల్ వార్డెన్ దాసరి మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మేదరమెట్లకు చెందిన పావులూరి వినోద్‌కుమార్ చినగంజాం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతూ స్థానికంగా ఉన్న ప్రయివేట్ హాస్టల్లో ఉంటున్నాడు. ఈక్రమంలో సాయంత్రం సమయంలో ఆడుకుంటుండగా వేడిపాలు ప్రమాదవశాత్తు మీద పడ్డాయి. దీంతో శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో వార్డెన్ చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

యువతిని వేధిస్తున్న యువకుడు

- ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు

ఈపూరుపాలెం(చీరాలటౌన్): తనకు పెళ్లి సంబంధాలు రానివ్వకుండా వ్యక్తి వేధిస్తున్నట్లు ఓ యువతి ఈపూరుపాలెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఆమెతో గతంలో ఉన్న పరిచయంతో ఫొటోలు మార్ఫింగ్ చేసి వేధిస్తున్నట్లు బాధితురాలు పోలీసుల వద్ద బోరుమంది. తనను వేధిస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

కారు ఢీ కొని ద్విచక్రవాహనదారునికి గాయాలు



క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

చినగంజాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహదారుని ఢీ కొట్టడంతో గాయాలైన సంఘటన కడవకుదురు సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారుకు టైరు పంక్చర్ అయింది. దీంతో కారు వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా చీరాల నుంచి కడవకుదురుకు ద్విచక్రవాహనంపై వస్తున్న బండారు ధనరాజుని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ధనరాజ్‌కు తీవ్ర రక్త గాయాలయ్యాయి. అతని ఎడమ కాలు నాలుగు వేళ్లు తెగిపోయాయి. క్షతగాత్రుని హైవే అంబులెన్స్‌లో చీరాల ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ శీలం రమేష్ పరిశీలించారు.

'రాళ్లపాడు' కుడి కాలువకు
140 క్యూసెక్కుల నీరు విడుదల



లింగసముద్రం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు కుడి కాలువలో 140 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. గురువారం 130 క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు శుక్రవారం మరో 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో రెండు పైపులను ఉపయోగించి సైఫన్ పద్ధతిలో నీటిని కాలువకు అందిస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. అలాగే మరో మూడు పైపులను కూడా సైఫన్ పద్ధతిలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు మోటార్లను తెప్పించి కాలువకు నీటిని పంపింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కుడి కాలువ నీరు అన్నెబోయిన పల్లె వరకు వదిలినట్లు తెలిపారు.

● రాపూరు : కండలేరు డ్యాంలో 56.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 1700 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 1075 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

'మాలకొండ' ఆదాయం
రూ.1,05,93,411


హుండీల్లోని నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వలేటివారిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 37 హుండీల ద్వారా (14 శనివారాలకు) రూ.1,05,93,411 ఆదాయం లభించినట్లు ఆ ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణ మండపంలో కందుకూరు-2 గ్రూపు దేవాలయం ప్రథమశ్రేణి కార్యనిర్వాహణాధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. నగదుతోపాటు 345 గ్రాముల బంగారం, 2 కేజీల 20 గ్రాముల వెండి, 152 యూఎస్ డాలర్లు, 10 కెనడా డాలర్లు, 60 ఇంగ్లండ్ పౌండ్స్ లభించాయి.

నేడు జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని జడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ, దీన్‌దయాళ్ అంత్యోదయ, ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన, అంత్యోదయ, స్వచ్ఛభారత్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమావేశంలో చర్చ జరుగుతుందని, సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

'ఉపాధి' భోక్తలపై క్రిమినల్ కేసు

కలువాయి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నగోపవరంలో ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి, అక్రమాలకు బాధ్యులైన ఆరుగురు సిబ్బందిపై కలువాయి పోలీస్‌స్టేషనులో క్రిమినల్ కేసు నమోదయ్యింది. వీరిపై ఎమ్పీడీవో డీవీ.నరసింహారావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రసహాయకుడు ఆదిరెడ్డి మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పి.బాబు రాజేష్, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంపీ.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ (ఇన్‌చార్జ్) జే.శీనయ్యలపై ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల కుటుంబాల జాబ్‌కార్డులలో గ్రామానికి సంబంధం లేని 148 మంది ఇతరుల పేర్లు చేర్పించి బోగస్ మస్టర్లు వేసి ప్రభుత్వ ధనం రూ.25.5 లక్షలు దుర్వినియోగం చేశారంటూ క్షేత్రసహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. అదేవిధంగా జరిగిన పనుల్లో బోగస్ కొలతలు వేసి రూ.32.87 లక్షలు దుర్వినియోగానికి కారణమైన సాంకేతిక సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై కూడా ఎఫ్ఐఆర్ కట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. రూ.1 లక్ష మించి అవినీతి జరిగితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఎన్నడూలేనంతగా చిన్నగోపవరంలో అవినీతి, అక్రమాలు జరిగాయి. గ్రామస్థులు ఫిర్యాదు మేరకు అంబుడ్స్ పర్సన్ విచారణలో వెలగుచూ సింది. అనంతరం జరిగిన సోషల్ ఆడిట్‌లో అక్రమాలు నిర్ధారించారు. గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష ఆదేశాల మేరకు భోక్తలపై వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్పీడీవో నరసింహారావు

● జిల్లాలో ఒక స్కూలుకూ దక్కని ఫైవ్‌స్టార్ రేటింగ్ ● 13 పాఠశాలలకు సున్నా రేటింగ్ ● నామమాత్రంగానే మౌలిక సదుపాయాలు

● వైసీపీ పాలనలో దెబ్బతిన్న విద్యా ప్రమాణాలు ● మెరుగుపరిచేందుకు కార్యాచరణ

'స్టార్' లేని చదువులు

'పాఠశాల విద్యను మేం బలోపేతం చేశాం. నేడు-నేడు పథకం ద్వారా స్కూలు భవన రూపురేఖలే మార్చేశాం. మేం తీసుకున్న మెరుగైన విద్యా ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు వచ్చాయి.' నాటి వైసీపీ పాలకులు చెప్పిన మాటలివి. అయితే, ఆచరణలో ఇవన్నీ బుడగలేనని తేలిపోయాయి.

ప్రభుత్వ బడులు పూర్తిగా వెనుకబడి పోయినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత వైసీపీ పాలనలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చేసిన ప్రచారం అంతా ఆర్భాటమేనని స్పష్టమైంది. కొన్ని పాఠశాలల్లో సదుపాయాలు ఉన్నా అభ్యసనా సామర్థ్యాలు లేక ఫలితాల్లో చతికిలపడ్డాయి. ఇంకొన్ని పాఠశాలల్లో ఫలితాలు ఉన్నా సౌకర్యాలు మాత్రం లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. పాఠశాల విద్యాశాఖ ఇటీవల చేపట్టిన అధ్యయనంలో జిల్లాలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. ప్రాథమిక విభాగంలో 5 పాఠశాలలు, ఉన్నత విభాగంలో 7 పాఠశాలలకు సున్నా రేటింగ్ వచ్చిందంటే ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు కార్యచరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు పాఠశాలలను దయనీయస్థితిలోకి నెట్టేశాయి. నాడు-నేడు పేరుతో ప్రజాధనాన్ని దోచిపెట్టి పనులను మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. అత్యధిక పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోగా, మరికొన్ని పాఠశాలల్లో అభ్యసనా సామర్థ్యాలు పూర్తిగా పడిపోయాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాల విద్యాశాఖ చేపట్టిన అధ్యయనంలో ప్రభుత్వ పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు తెలుసుకునేందుకు మౌలికసదుపాయాలు, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి స్టార్ రేటింగ్‌లను ప్రకటించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని ఒకటి నుంచి ఐదు స్టార్‌ల వరకు రేటింగ్ ఇచ్చారు. తక్కువ స్టార్స్ సాధించిన పాఠశాలలపై దృష్టి సారించి వాటి అభివృద్ధికి సూచనలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు, 'పది'లో ఉత్తీర్ణత, 1 నుంచి 9వతరగతి వరకు విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా అకడమిక్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అలాగే మరుగుదొడ్లు, విద్యుత్, డిజిటల్ తరగతులు, ప్రహరీలు, మంచినీరు, ఫర్నిచర్, తరగతి గదులు, లైబ్రరీ తదితర సౌకర్యాలను ప్రామాణికంగా తీసుకుని రేటింగ్ కేటాయించారు.


● మరీ ఇంత దారుణమా!?

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,602 వరకు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కదానికి కూడా రెండు విభాగాల్లోనూ ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కలేదు. మౌలిక సదుపాయాల విషయంలో ప్రాథమిక పాఠశాలలు 218, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 2 కలిపి మొత్తం 222 పాఠశాలలు మాత్రమే పర్వాలేదన్నట్లు ఫోర్ స్టార్స్ లభించాయి. ప్రాథమిక విభాగంలో 892 పాఠశాలలకు 3 స్టార్, 880 పాఠశాలలకు 2 స్టార్, 76 పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కగా, ఒక్క పాఠశాలకు మాత్రం జీరో రేటింగ్ వచ్చింది. అలాగే ప్రాథమికోన్నత విభాగంలో 121 పాఠశాలలకు 3 స్టార్, 73 పాఠశాలలకు 2స్టార్, ఒక్క పాఠశాలకు 1స్టార్ రేటింగ్ లభించింది. ఉన్నత విభాగంలో 141 పాఠశాలలకు 3స్టార్, 190 పాఠశాలలకు 2 స్టార్, ఐదు పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కింది. అభ్యసనా సామర్థ్యాల విషయంలో జిల్లాలో ఒక్క పాఠశాలకు కూడా 5స్టార్ కాదు కదా.. 4 స్టార్ రేటింగ్ కూడా దక్కలేదు. ప్రాథమిక విభాగంలో 173 పాఠశాలలకు 3స్టార్, 1314 పాఠశాలలకు 2స్టార్, 575 పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కించుకున్నాయి. ప్రాథమికోన్నత విభాగంలో ఒక్క పాఠశాలకు 3స్టార్, 116 పాఠశాలలకు 2 స్టార్, 80 పాఠశాలలకు 1స్టార్ రేటింగ్ లభించాయి. ఉన్నత

- మిగతా 6లో..

విద్యా శాఖ అధ్యయనంలో నమ్మలేని నిజాలు వెలుగులోకి

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం




ఉదయగిరి : గండిపాళెంలోని పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 'దీంతో ఓ దాత సహకారంతో అద్దెభవనంలో పాఠశాల నడుస్తోంది.



మర్రిపాడు : పొంగూరు హైస్కూలులో అర్ధంతరంగా ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం


సంగం హైస్కూల్లో అసంతపూర్తిగా ఉన్న 'నాడు-నేడు' భవన నిర్మాణ పనులు

● జిల్లాలో కానరాని నైపుణ్య గణన

నైపుణ్యం కట్టుకోండి!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో ఒకటైన నైపుణ్య గణన జిల్లాలో తూతూ మంత్రంగా మారింది. దీనికి డిస్ట్రిక్ట్ స్కిల్ కమిటీస్ (డీఎస్‌సీ) సమా వేశాల నిర్వహణే నిదర్శనం. 2024-25 సంవత్సరానికి సంబంధించి నెలకొకటి వంతున జిల్లాలో 12 సమావేశాలు జరగాల్సి ఉండగా మొన్నటి వరకు ఒకే ఒక్క సమావేశం నిర్వహించడం గమనార్హం. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాకు సంబంధించి 'నైపుణ్య' సమావేశాల అంశమై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా అధికారులు ఆఘమేఘాల మీద విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చి రెండో సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా జిల్లాలో నిర్వహించటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



శిక్షణ కార్యక్రమాలు జరిగాయి

నైపుణ్య గణనకు సంబంధించి సచివాలయ సిబ్బందికి, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. జిల్లాలో నైపుణ్య కమిటీ సమావేశాలు ప్రతి నెలా జరగడం లేదు. మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నాం.

- అబ్దుల్ ఖయ్యూం, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి

- నవంబరు 1 నుంచి ప్రారంభించాలి
- నేటికీ మొదలుకాని వైనం
- మరోవైపు పారిశ్రామిక పరుగులు
- ఎంతో మంది ఉద్యోగులు అవసరం
- అయినా యువతకు శిక్షణ, ఉపాధి కరువు
- తూతూ మంత్రంగా జిల్లా స్కిల్ కమిటీస్ సమావేశాలు
- నెలకొకటి జరగాల్సి ఉంటే.. ఇప్పటికి జరిగింది ఒక్కటే!
- కలెక్టర్ల సమావేశంలో సీఎం సీరియస్
- ఇప్పటికైనా మెరుగుపడేనా?!
- త్వరగా పూర్తి చేయాలని నిరుద్యోగుల వేడుకోలు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కు వివిధ నైపుణ్య రంగాలలో శిక్షణ ఇప్పిస్తే వారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టింది. తొలుత మంగళగిరిలో గణన చేపట్టగా అది విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్యగణన చేపట్టాలని నిర్ణయించింది. దీని నిర్వహణపై సచివాలయాలు, ఇతర శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. జిల్లాలో నవంబరు 1 నుంచి నైపుణ్య గణన ప్రారంభం కావాల్సి ఉన్నా ఇప్పటికీ ఆ దాఖలాలు లేవు.

● 15 నుంచి 59 ఏళ్ల వారికి..

నైపుణ్యం అనే ప్రత్యేక యాప్ ద్వారా ఇంటింటా నైపుణ్య గణనను నిర్వహించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది జనాభా లెక్కల మాదిరిగానే ఈ నైపుణ్య గణన చేస్తారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్ర ప్రభుత్వం ఈ గణనకు సిద్ధమైంది. నిరుద్యోగులు ఏమి చదువుతున్నారు. ఏ పని చేయగలరు, వారి నైపుణ్యాలు ఏమిటి, అన్న వివరాలు నమోదు చేస్తారు. ఇందుకోసం 15 నుంచి 59 ఏళ్ల వయసున్న వారి వివరాలు సేకరిస్తారు. ప్రతి ఒక్క కుటుంబంలోని ప్రతి ఒక్కరి విద్యార్హతలు, నైపుణ్య వివరాలు నమోదు చేస్తారు. టెన్త్ ఫెయిల్, పాస్ అయినా, ఐటీఐ అయితే దానిలోని ట్రేడ్లు, బీఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్ అయితే అందులోని బ్రాంచిల వివరాలతో సహా సమాచారం సేకరిస్తారు. ప్రస్తుతం తక్కువ ఆదా యం పొందుతున్నవారి ఆదాయాన్ని పెంచేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. గణన వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు.

● పరిశ్రమల అవసరాల గుర్తింపు

జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రం కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తోంది. ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు తోడు , కొత్తవాటికి భారీగా ఉద్యోగులు అవసరం. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ఆ దిశగా పూర్తిస్థాయిలో చర్యలు కరువయ్యాయి. ఈ క్రమంలో నైపుణ్య గణన పూర్తయిన తరువాత కంపెనీలు, పరిశ్రమలు ఎలాంటి నైపుణ్యాలు కోరుకుంటున్నాయో ప్రభుత్వం గుర్తిస్తుంది. నిరుద్యోగులకున్న నైపుణ్యాలను, పరిశ్రమల అవసరాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి తగిన శిక్షణ ఇస్తారు. ఈ 'గణన' వల్ల జిల్లాలో ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు?, వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలి? వంటి అంశాలపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. ఈ నైపుణ్య శిక్షణకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్‌ను కూడా ఉపయోగించుకోనున్నారు. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ సెక్టార్, వ్యవసా యం, బ్యూటీ వెల్‌నెస్, ఇంటి పనివాళ్లు, ఆహార పరిశ్రమ సామర్థ్యం, ఫర్నిచర్, ఫిట్టింగ్, పవర్ సెక్టార్ వంటి అన్నీ రంగాల్లోనూ నైపుణ్య శిక్షణకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. సర్వే పూర్తయిన తరువాత ప్రత్యేక నైపుణ్య శిక్షణ ప్రణాళికలను రూపొందిస్తారు. ఈ మేరకు విద్యార్థులకు విద్యాసంస్థల్లో నైపుణ్యాలు అందించనున్నారు. ఇందుకోసం బీటెక్, డిగ్రీ సిలబస్‌లో అవసరమైన మార్పులు చేయాలని యోచిస్తున్నారు. నిరుద్యోగు లకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి నైపుణ్యాలు అందిస్తారనే దానిపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న కార్యక్రమంపై అధికార యంత్రాంగం శ్రద్ధ వహించకపోవ డంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్కిల్ డెవలప్‌మెంటు కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, సర్వేను త్వరగా పూర్తి చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

సహకార సంఘాల్లో
ప్రత్యేకాధికారుల పాలనే..!

మరో ఆరు మాసాలు పొడిగింపు ● ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే!

● ఆశావహుల నిరాశ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార సంఘాలకు ప్రత్యేకాధికారుల పాలనా కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు ఎరువులు, పురుగు మందులు సరసమైన ధరలకు అందించడానికి, పరపతి సౌకర్యం కల్పించడానికి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు, విత్తనాలు తక్కువ ధరలకు అందించడానికి జిల్లాలో సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. 1964 సహకార సంఘాల చట్టం ప్రకారం అవి నడుస్తున్నాయి.

ప్రస్తుతం జిల్లాలో 78 సహకార సంఘాలున్నాయి. వాటికి 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. 2018 ఫిబ్రవరి లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, నాటి టీడీపీ ప్రభుత్వం వాయిదా వేసింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటి వరకు సహకార సంఘాలకు ఉన్న పాలకవర్గాలను రద్దు చేసింది. వాటి స్థానంలో సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసి తమకు అనుకూల మైన వారిని వాటిలో నియమించింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల త్రిసభ్య కమిటీలే కొనసాగాయి. ఎన్నికలు జరుగుతాయని ఎప్పటికప్పుడు అనుకున్నా, వాయిదా పడుతూ వచ్చాయి. ఎన్నికలు జరగ కపోగా, సహకార సంఘాల పనితీరు మందగించింది. పలు సంఘాల్లో నాయకులు నిబంధన లకు విరుద్ధంగా ఉద్యోగనియామకాలు చేపట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులను కూడా ఇష్టారీతిన వినియోగించి సంఘాలు ఆర్థికంగా దెబ్బతినటా నికి కారకులైనారనే విమర్శలు వచ్చాయి. అయితే కొందరు మాత్రం ప్రతిష్టాత్మకంగా పనిచేసి సొసైటీల పనితీరును మెరుగుపరచి వాటికి మంచి పేరు తీసుకుని వచ్చారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సహకార సంఘాల త్రిసభ్య కమిటీలకు నాయకత్వం వహిస్తున్నవారు రాజీనామా చేశారు. త్రిసభ్య కమిటీలను రద్దు చేసిన ప్రభుత్వం సహకార శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులను ఆ సంఘాలకు ప్రత్యేకాధికారు లుగా నియమించింది. వారు ఆయా సంఘాల పనితీరును మెరుగుపరుస్తూ, ఎన్నికలు జరుగుతాయని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సంఘాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు. సంఘాల్లో ఓటర్ల జాబితాను కూడా సిద్ధం చేస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకా ధికారుల పాలనా కాలం పొడిగించడం విశేషం. దీంతో ఎన్నికలు జరుగుతాయని ఎదురు చూసిన ఆశావహుల ఆశలు అడియాశలయ్యాయి.



ఇది ఇంతేనా!?

వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లెలో అటవీ శాఖ సిబ్బంది క్వార్టర్స్ వినియోగంలో లేక శిథిలావస్థకు చేరాయి. సిబ్బంది ఇక్కడ నివాసం లేకపోవడంతో చుండి సెక్షన్ పరిధిలోని అయ్యవారిపల్లె, మాలకొండ, చుండి రామ లింగాపురం గ్రామాల్లోని అటవీ సంపద అక్రమంగా తరలిపోతోంది. 30 ఏళ్ల కిందట ఇక్కడ ఫారెస్టు సిబ్బంది కోసం రూ.లక్షలు వెచ్చించి అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం భవనాలు నిర్మించింది. నాలుగైదేళ్ల ఫారెస్టర్, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, గార్డ్ తదితర సిబ్బంది ఇక్కడే కాపురం ఉండేవారు. ఆ తర్వాత వాళ్ల పట్టణాలకు వెళ్లిపోవడంతో భవనాలు నిరుప యోగంగా మారాయి. అక్రమా ర్కులు రాత్రిళ్లు అక్రమంగా అడవు ల్లో కలపను నరికివేసి పొగాకు బ్యారనీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



- వలేటివారిపాళెం, (ఆంధ్రజ్యోతి)

ప్రైవేట్ కళాశాలల గుర్తింపునకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నడుస్తున్న అన్నీ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి అఫిలియేషన్, రెన్యువల్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు అదనపు సెక్షన్లు, కోర్సులతోపాటు ద్వితీయ భాషను, మీడియంను, ప్రదేశాన్ని, మేనేజ్‌మెంట్‌ను కూడా మార్చుకోవచ్చన్నారు. అలాగే ఏదైనా కళాశాల మూసివేయడానికి, పునః ప్రారంభించడానికి, ఎఫ్‌డీఆర్‌ను విడుదల చేసుకునేందుకు కూడా ఇంటర్‌బోర్డు అవకాశం కల్పిస్తోందని తెలిపారు. జిల్లాలోని కళాశాలల యాజమాన్యాలు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్ అఫిలియేషన్ మేనేజ్‌మెంట్ (ఓఏఎంఎస్) ద్వారా 2025 ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో గుర్తింపు రెన్యువల్ చేసుకోనటువంటి కళాశాలలు కూడా ఏడాదికి రూ.50వేలు చొప్పున చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. కండిషనల్ గుర్తింపు పొందిన కళాశాలలు 3 నెలల్లో లోటుపాట్లను సరిచేసుకుని సంబంధిత ధ్రువపత్రాలను అందచేయాలని, లేనిపక్షంలో నిర్ణీత గడువు తరువాత రూ.50వేలు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దరఖాస్తు చేసిన కళాశాలలను తనిఖీ కమిటీ సందర్శించి అందించే నివేదికల ఆధారంగా అనుమతులు మంజూరు చేస్తారన్నారు. బోర్డు నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా కళాశాలలు అదనపు సెక్షన్లు నిర్వహించినా, ప్రవేశాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హమ్మయ్య.. తెప్పించారు!



రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచామని రైతులెవ్వరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఎన్‌వీఆర్ సహకార సంఘంలో 'యూరియా స్టాక్ అయిపోయింది' అనే వార్తపై ఆయన స్పందించి సహకార సంఘాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. వారం రోజులుగా యూరియా అందుబాటులో లేని విషయం నిజమేనని చెప్పారు. ఈ క్రమంలో ఒక్కసారిగా రైతులు తొందర పడడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఇపుడు అవసరం అయినంత తెప్పించామని కావాల్సిన రైతులు కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవాలని సూచించారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, ఏపీఎంఐపీ, మార్కెటింగ్ శాఖల అధికారులు

మామిడి బీమాను
సద్వినియోగం చేసుకోండి

- ప్రీమియం చెల్లింపునకు నెలాఖరు వరకు గడువు
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో పంట నష్టం వాటిల్లితే రైతులను ఆదుకునేందుకు రబీ సీజన్‌కు సంబంధించి మామిడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయాన్ని కల్పించిందని, సాగుదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మామిడి పంట వాతావరణ ఆధారిత బీమా పథకం పోస్టర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎకరాకి బీమా మొత్తం రూ.45వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. మీసేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బ్యాంకుల్లో ఈ నెల 31వతేదీలోపు రూ.2250 ప్రీమియం చెల్లించి పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా సమాధానం చెప్పాలి

- అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నెల్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగానే దేశంలోని అన్నీ వ్యవస్థలు నడుచుకుంటున్నాయన్నారు. అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయటం దారుణమన్నారు. అమిత్ షా తక్షణమే జాతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, సంజయ్ కుమార్, మల్లికార్జునరెడ్డి, అల్లాఉద్దీన్, మోహన్, శ్రీరాములు, పప్పర్తి గణేష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయ్యా!

- ఎరువుల కోసం అన్నదాతల గగ్గోలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు



బుచ్చిరెడ్డిపాళెం : పవ్వేరు బ్యాంకులో యూరియా కట్టల కోసం ఎగబడుతున్న రైతులు

కోవూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా అందించడంలో వ్యవసాయ శాఖ సరైన విధానం అమలు పరచలేకపోతోంది. దీంతో రైతులు సొసైటీలు, దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. వరి నాట్లు పూర్తయిన వెంటనే వాతావరణం బాగుంటే రోజుల వ్యవధిలోనే యూరియాతోపాటు డీఏపీ వంటి ఎరువులను పొలాల్లో చల్లుతుంటారు. అయితే, ఈసారి ఎరువుల దిగుమతిలో కొంత ఆలస్యం అయ్యింది. సాధారణంగా వరినాట్లకు ముందుగానే జిల్లాలోని రైతాంగానికి సరిపడినంత యూరియాను దిగుమతి చేసుకోవాలి. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో మార్పు కారణంగానో గోదాములకు యూరియా చేరడం ఆలస్యమైంది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. యూరియా దక్కదేమోనన్న ఆందోళనతో కొందరు రైతులు అవసరానికి మించి ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. ఇదే అదునుగా దుకాణాల యజమానులు కూడా యూరియా కావాలంటే డీఏపీ వంటి ఎరువులు, క్రిమిసంహారకాలు కొనుగోలు చేయాలనే నిబంధన విధించారు. కొన్నిచోట్ల యూరియాను రహస్య ప్రాంతాల్లో దాచి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని పథకం పన్నారు. ఇది పసిగట్టిన వ్యవసాయ శాఖ అధికారులు దాడులు చేయడంతో వ్యాపారులు యూరియాను దాచాలనే ఆలోచన విరమించారు.

'పవ్వేరు'లో రైతుల్లో ఆగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : పవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంకులో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు నిరీక్షిస్తే 1 కట్ట యూరియా దొరకడం గగనంగా మారింది. శుక్రవారం పవ్వేరు బ్యాంకు అధికారులు వ్యవహరించిన తీరు రైతులను ఆగ్రహానికి గురిచేసింది. సిఫారసు ఉన్న వాళ్లకే యూరియా కట్టబెట్టి తమను ఇబ్బందులకు గురిచేస్తే కలెక్టర్ దగ్గరకే వెళ్తామని రైతులు హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి వెంటనే అక్కడకు చేరుకుని ఎకరాకు ఒక కట్ట లెక్కన యూరియా పంపిణీ చేశారు. 5 కట్టలకు పైబడి అవసరమైన వారికి పాసుపుస్తకాలు పరిశీలించి పంపిణీ చేశారు.



సంగం : వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన యూరియాను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు

రైతులందరికీ సరఫరా చేస్తాం

కోవూరు మండలం పడుగుపాడు సొసైటీలో 36 టన్నుల యూరియా నిల్వ ఉంది. ప్రభుత్వ ధరలకే విక్రయిస్తున్నాం. మరో 60 టన్నుల యూరియా రెండు రోజుల్లో రానుంది. కొందరు వ్యక్తులు పనిగట్టుకుని కొరత సృష్టించాలని చూశారు. వారి కుట్రను వ్యవసాయశాఖాధికారులు పసిగట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చేశారు.

- కొండూరు గోవర్ధనరెడ్డి, సీఈఓ, పడుగుపాడు సొసైటీ

నగదు చెల్లించిన యూరియా అందచేత

సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో నగదు చెల్లించిన రైతులకు శుక్రవారం యూరియా సరఫరా చేశారు. డిమాండ్ ఏర్పడటంతో రూ.266 ఉన్న యూరియా ప్రైవేట్ మార్కెట్‌లో రూ.350లకు విక్రయిస్తున్నారు. అయినా లభ్యం కావడంలేదు. దీంతో కొందరు రైతులు రైతు సేవా కేంద్రంలో వారం రోజుల క్రితం యూరియా కోసం నగదు చెల్లించారు. ఆ మేరకు 400 బస్తాల యూరియాను నగదు చెల్లించిన రైతులకు అందచేశారు.



కోవూరు : యూరియా మోసుకెళ్తున్న కూలీ

భూముల రీ సర్వేకు
పిడూరు ఎంపిక

- 24 నుంచి ప్రారంభం

మనుబోలు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక తొలిసారిగా భూముల రీసర్వేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలో పిడూరు రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ గ్రామంలో ఈనెల 24వ తేదీ నుంచి రీసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పిడూరులో 3 నెలల పాటు రీసర్వే ప్రక్రియ జరుగుతందన్నారు. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా 14 గ్రామాల్లో మాత్రమే గతంలో రీసర్వే జరిగిందన్నారు. ఫిబ్రవరి తరువాత ఎన్నికల కోడ్ రావడంతో రీసర్వే నిలిచిపోయిందన్నారు. పిడూరులో 498 సర్వే నెంబర్లలో 4,810 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూములు ఉన్నాయన్నారు. అందులో మెట్ట భూములు 1,905 ఎకరాలు, మాగాణి భూములు 1,771 ఎకరాలు, ప్రభుత్వ భూములు 1056 ఎకరాలు ఉన్నాయన్నారు. అలాగే గ్రామనత్తం 62, ఇనాం భూములు 14 ఎకరాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామంలో రీసర్వే పూర్తయిన తరువాత ప్రభుత్వ ఆదేశాలతో మిగిలిన మనుబోలు, మడమనూరు, వడ్లపూడి గ్రామాల్లో రీసర్వే చేపడుతామని తెలిపారు.



తహసీల్దారు సుబ్బయ్య

పోక్సో కేసులో
నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు, (లీగల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు అలియాస్ సుబ్బు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి తనతో తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడికి తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిక మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోగిలి సుబ్రహ్మణ్యం, ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన ఎల్లంటి వెంకటయ్య, బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన మంగళూరు వాణి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓజిలి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ఒక్కొక్కరికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష, 22 వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

స్టార్‌లేని చదువులు

(5వ పేజీ తరువాయి)

విభాగంలో 2 పాఠశాలలకు 3స్టార్, 33 పాఠశాలలకు 2స్టార్, 296 పాఠశాలలకు 1స్టార్ రేటింగ్ లభించాయి.

- 12 పాఠశాలలకు సున్నా రేటింగ్

జిల్లాలో ప్రాథమిక విభాగంలో 5 పాఠశాలలకు, ఉన్నత విభాగంలో 7 పాఠశాలలకు మొత్తం 12 పాఠశాలలకు సున్నా రేటింగ్ లభించాయి. ప్రాథమిక విభాగంలో స్టోబీడీ కాలనీ, అంబాపురం, అంకుపల్లి మెయిన్, ఆర్‌వైజీ పాళెం, కుర్రపల్లి బీసీ ఎంపీపీఎస్ పాఠశాలలు సున్నా రేటింగ్ లభించింది. అలాగే ఉన్నత విభాగంలో అల్లూరుపేట, ఈస్ట్ గోగులపల్లి, నార్త్ మోపూరు, పట్టపుపాళెం, టిటుకూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు, చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్ పాఠశాల, యర్రగుంట బాలుర బీసీ వెల్ఫేర్ పాటశాలలు సున్నా రేటింగ్ పొందాయి. ఈ పాఠశాలల్లో కనీస సదుపాయాలు, వసతులు కూడా లేకపోగా అభ్యసనా సామర్థ్యాలు, ఫలితాల్లో పూర్తిగా వెనుకబడినట్లు అధికారులు గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు విద్యారంగం నిర్వీర్యం కాగా కూటమి ప్రభుత్వం వీటిని సరిదిద్దేందుకు అవస్థలు పడుతోంది. త్వరలోనే అన్ని పాఠశాలల్లో స్టార్‌లను మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆచరణలో పెట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

భవిత కేంద్రాల్లో
ఉత్తమ సేవలందించాలి

- డీఈవో డాక్టర్ బాలాజీరావు

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సిబ్బంది ఉత్తమ సేవలందించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీ రావు సూచించారు. భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న సహిత విద్య కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై నెల్లూరులోని సుంకు చెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలన్నీ పిల్లలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని అంశాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు ఎలా ఉపయోగించాలి, సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలన్న అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. పింఛన్ సదుపాయాలు, యూడీఐడీ కార్డులను అందించడం, దివ్యాంగ విద్యార్థులకు ఆరోగ్య బీమా, ఉపకారవేతనాలకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ మల్లికార్జున పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, కందుకూరు డిప్యూటీ ఈవో జాన కిరామ్, జిల్లా కోఆర్డినేటర్ పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

హైవేపై వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఎన్టీఆర్ నగర్ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో షేక్ జైనుల్లా, మస్తానమ్మ(60) దంపతులు నివసిస్తున్నారు. గురువారం వారిద్దరూ వెంకటాచలం మండలం గురి విందపూడి గ్రామంలో జరిగిన మనుమరాలి సీమంతం వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బైక్‌పై జాతీయ రహదారి మీదగా భగత్‌సింగ్‌కాలనీకి బయలు దేరారు. ఎన్టీఆర్ నగర్ సమీపంలో వెనుక నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. దీంతో దంపతులిద్దరు రోడ్డుపై పడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యే క్రమంలో రోడ్డుపై పడి ఉన్న మస్తానమ్మ పైనుంచి వాహనాన్ని పోనిచ్చాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో నార్త్‌ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శుక్రవారం జైనుల్లా ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు.

కూలీ నుంచి యువశాస్త్రవేత్తగా అశోక్

- కష్టపడి సంపాదించి ఫీజులు చెల్లించి విద్యాభ్యాసం
- తల్లిదండ్రులిద్దరూ దివ్యాంగులే..
- అయినా పట్టుదలతో ఉన్నతస్థాయికి..
- అమెరికాలో కేన్సర్‌పై పరిశోధనలు

ఆ యువకుడు మారుమూల గ్రామంలో పుట్టాడు... తల్లిదండ్రులిద్దరూ దివ్యాంగులే... పుస్తకాల కొనుగోలుకు కూడా డబ్బుల్లేవు... అయినా కృంగిపోలేదు... కూలి పనులకు వెళ్లి వచ్చిన సంపాదనతో చదువు సాగించాడు... అనుకున్నది సాధించాడు... ఆయన ప్రతిభకుతోడు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా లభించడంతో అమెరికాలో కేన్సర్‌పై పరిశోధనలు చేసి ఎన్నో అవార్డులు సాధించాడు. ఎంతోమంది ప్రశంసలు పొందాడు. ఆయనే పుట్టువారి పల్లెకి చెందిన యువశాస్త్రవేత్త చీమల అశోక్.

- ఏఎస్‌పేట, (ఆంధ్రజ్యోతి)



ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న యువ శాస్త్రవేత్త అశోక్

పేదింటి నుంచి శాస్త్రవేత్త

ఏఎస్‌పేట మండలం రాజవోలు పంచాయతీ పుట్టువారిపల్లి గ్రామానికి చెందిన చీమల తిరుపాలు, నాగమ్మ దంపతులకు ఆశోక్,ఆనంద్ సంతానం. ఆ దంపతులు ఇంటి ఆవరణంలోనే చిల్లర దుకాణం పెట్టుకుని పిల్లలను చదివించేవారు. పెద్ద కుమారుడు ఆశోక్ చిన్నప్పటి నుంచి చదువులో రాణిం చేవాడు. ఏడో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఆ తరువాత నుంచి చదువుల కోసం పక్కనున్న ఆత్మకూరుకు వెళ్లా ల్సి రావడంతో కష్టాలు మొదల య్యాయి. ఫీజులు,పుస్తకాలకు డబ్బులు లేక, సెలవు ల్లో కూలి పనులకు వెళ్లేవాడు. అలా వచ్చిన నగదుతో చదువు సాగించాడు. ఎలాగో 10వ తరగతి పూర్తి చేసి వింజమూరులో ఇంటర్ చేరా డు. ఎండకాలం సెలవుల్లో బెంగళూరుకి వెళ్లి బేల్దారి పనులు చేశాడు. కూలి పనులు చేస్తూనే 2008లో తిరుపతి ఎస్వీయూ బీఎస్సీ చదివి ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. 2010లో బెంగళూరు యూనివర్సిటీలో ఎంఎస్సీలోనూ మొదటి ర్యాంక్ సాధించాడు.

ఆసరాగా ఉపకార వేతనం

అదే ఏడాది స్టూడెంట్ మెరిట్ అవార్డు పొంది ప్రభుత్వం నుంచి నెలకు రూ. 40వేలు ఉపకార వేతనం పొందారు. 2012లోనూ జాతీయ స్థాయిలో పరీక్ష రాసి ప్రభుత్వం నుం చి నెలకు రూ. 70వేల ఉపకార వేలతనంతో కేన్సర్ బయా లజీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన ప్రతిభను గుర్తించి 2020లో అమెరికాలోని సెంటర్ ఫర్ వ్యాస్కులర్ బయాలజీ యూ కాన్ హెల్త్ కనెక్టికట్ వారు ఏడాదికి రూ. 40లక్షల ఫెలోషిప్‌తో శాస్త్రవేత్తగా శిక్షణకు ఆవకాశం కల్పించారు.

అవార్డులు, ప్రశంసలు

బ్రెస్ట్ కేన్సర్‌లో ఎన్నో పరిశోధనలు చేసి తక్కువ ఖర్చుతో వ్యాధి నివారణకు ఉన్న అవకాశాలను కనుగొన్నారు. దీంతో ఆయన ఎన్నో అవార్డులు, ప్రశంసలు పొందారు. అల్జీమర్ వ్యాధిపై కూడా పరిశోధనలు చేశారు. 2013లో న్యూయార్క్‌లో నిర్వహించిన సదస్సులో సుమారు 34 దేశాల 685 మంది శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు. వారంతా 200 పరి శోధన పత్రాలను సమర్పించగా, అందులో నాలుగు పత్రా లకు అవార్డులు రాగా, అందులో ఒకటి అశోక్ కావడం విశేషం.

పట్టుదలతో శ్రమిస్తే విజయమే..

పట్టుదల ఉండి, లక్ష్యం కోసం శ్రమిస్తే ఎవరైనా విజయం సాధిం చవచ్చు మట్టిలో లభించే వజ్రాన్ని సానపెట్టినప్పుడే దాని విలువ పెరుగుతుంది. అలానే కష్టాలను అధికమించి ముందుకు సాగినప్పుడే మన ప్రతిభ అందరికీ తెలుస్తుంది. గ్రామాల్లోని యువకులు వజ్రాల వంటివారు. వారిలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహిస్తే ఎలాంటి విజయాలను అయినా సాధిస్తారు.

- యువశాస్త్రవేత్త ఆశోక్

వక్ఫ్ భూముల
లెక్క తేల్చండి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జిల్లాల వారీగా అన్యాక్రాంతమైన వక్ఫ్ భూముల లెక్కలు తేల్చాలని వక్ఫ్ బోర్డు అధికారులను ఆ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆదేశించారు. నెల్లూరులోని ఆయన కార్యాలయం నుంచి శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో, 26 జిల్లాల ఇన్‌స్పెక్టర్లు, ఆడిటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్లు నిజాయ తీగా పనిచేయాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల స్మింటీసీ రికార్డుల్లో పొందుపరచాలని సూచించారు.

ఆస్పత్రా.. అసాంఘికాలకు నిలయమా!?

● అడవిని తలపిస్తున్న గండిపాలెం పశువైద్యశాల ● పశువైద్యానికి వచ్చేందుకు జంకుతున్న పాడిరైతులు



ఆస్పత్రి ఆరణలో మందుబాబులు పడేసిన ఖాళీ సీసాలు, గ్లాసులు



కంపచెట్లతో మూసుకుపోయిన గండిపాలెం పశువైద్యశాలకు వెళ్లే రోడ్డు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం పశు వైద్యశాలకు వెళ్లాంటే ప్రజలు, పాడి రైతులు హడలెత్తిపోతున్నారు. తొమ్మిది పంచాయతీలకు సంబంధించిన ఏకైక వైద్యశాల కావడంతో ప్రతినిత్యం తమ జీవాల వైద్యం కోసం ఎంతో మంది ఇక్కడికి తీస్తుంటారు. తీరా అక్కడికి వచ్చాక వైద్యశాల ప్రాంగణంలోని అల్లుకుని ఉన్న కంప, పిచ్చి చెట్లను చూసి నివ్వెరపోతున్నారు. విషపురుగుల తాకిడికి గురి కావాల్సి వస్తుందోమోనని వాపోతున్నారు. కనీసం లోపలికి వెళ్లే రోడ్డు సైతం కంచెట్లతో మూసుకుపోయినా వాటిని తొలగించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రహరీ గేటు వేసే అవకాశం కూడా లేకుండా పోయింది. వైద్యశాల కాస్త మందుబాబులకు అడ్డాగా మారందని స్థానికులు చెబుతున్నారు. ఎంచక్కా మద్యం సేవించి ఖాళీ సీసాలు, గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు అక్కడే పడేయడంతో ప్రాంగణమంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. పట్టుమని పది నిమిషాలు ఉండలేమని అక్కడికి వచ్చిన పాడి రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీటి సరఫరా



తాగునీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్

అల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేట, ఇస్కపల్లి రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం కెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకరుతో తాగునీటిని సరఫరా చేశారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేని ప్రాంతాల్లో కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపకారు. పలుమార్లు అధికారులను విన్నవించుకున్నా తాగునీటి సరఫరా సమస్యలను తీర్చలేదని ఫౌండేషన్ తీర్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీలర్‌పై 6ఏ కేసు నమోదు

చేజర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరు గ్రామంలోని రేషన్‌షాపు నెం.920030లో ఈ-పాస్ మిషన్‌లో ఉన్న సరుకులకు భారీగా వ్యత్యాసం ఉండడంతో సదరు డీలరుపై 6ఏ కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. చిత్తలూరులో రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడంలేదన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఆర్ఐ వెంకటేశ్వర్లు, వీఆర్‌వో హరీష్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బియ్యం 2,255 కేజీలు, చక్కెర 43 ప్యాకెట్‌లు, కందిపప్పు 19ప్యాకెట్‌లు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాతీయ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పీ.ఐజాక్‌ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు తదితర ఉపకరణముల కోసం అర్హులైన వారిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, యుడీఐడీ కార్డు, వయోవృద్ధులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని క్యాంపునకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

రైతులకు అండగా టీడీపీ ప్రభుత్వం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సును దృష్టిని ఉంచుకొని టీడీపీ ప్రభుత్వం నిరంతరం రైతులకు అండగా నిలుస్తుందని పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అన్నారు. శుక్రవారం విరువూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు పంపిణీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో రవికుమార్, నేతలు ముజ్జి లక్ష్మినారాయణ, వీపీఏలు శారద, చంద్రశేఖర్, శ్రీకాంత్, ఆదిత్య, పవన్ పాల్గొన్నారు.

గాడ్గే బాబాకు రజక ఉద్యోగుల నివాళులు

కందుకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మూలపురుషుడు గాడ్గే బాబా ఆదర్శనీయుడని రజక ఉద్యోగుల సంఘం నాయకులు కోటయ్య, బొప్పరాజు కాశీరత్నం తెలిపారు. వర్ధంతి సందర్భంగా శుక్రవారం కందుకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీ వసతిగృహం తనిఖీ

సంగం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి ప్రసన్న శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు, నిల్వ సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

ఉదయగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాయశయం కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించనున్నట్లు జలవనరులశాఖ డీఈ చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. 17 డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్న ట్లు చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

కావలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సర్వాయపాలెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న బెల్టు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులతో కలిసి సీఐ శ్రీనివాసులు దాడులు నిర్వహించారు. తెలిపారు. ఈ దాడుల్లో మద్యం అమ్మకాలు చేపడుతున్న ఇస్రారపు శీనయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 12 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన ఉపాధ్యాయులు

కావలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజువారి చింతలపాలెం జెడ్పీ హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు జగన్నాథ్ చేతులమీదుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకట రమణ శుక్రవారం స్టడీ మెటీరియల్ మాదిరి ప్రశ్నాపత్రాల బుక్‌ను అందజేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, సురేష్, మహేష్, ఫయాజ్, హర్షవర్ధన్, అంజనేయకుమార్, ఆర్.వెంకటేశ్వర్లు, సురేంద్రారెడ్డి, వీణా మాధవి పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన ఉండాలి

ఏఎస్ పేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లడుతూ సైబర్ నేరాలు, మహిళల చట్టలపై అవగహన ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ హెచ్చరించారు. శుక్రవారం గణేశ్వరాపురంలో ఆక్రమణకు గురైన భూములను ఆమె పరిశీలించారు. సర్వే నంబరు 196 లోని పశువుల మేత పోరంబోకు భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు కొంతమంది గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆక్రమణదారులకు నోటీసులు అందజేసి భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు హేమంత్‌కుమార్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు స్థానిక సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులోను పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మైనింగ్ తవ్వకాలను అనుమతులు ఇవ్వొద్దని జంగంరెడ్డిపల్లివాసులు ఆమెకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కుమార్, డీటీ చెంచయ్య, వీఆర్వోలు భోగ్యం ప్రసాద్, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభ కానుకలు అందజేత



కానుకలతో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సీతారామపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా మహాసభలు నిర్వహించినట్లు ఆ శాఖ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోగ్యం శ్రీనివాసులు, గొడ్లవేటి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అందులో భాగంగా మహాసభకు హాజరైన ఉపాధ్యాయులకు క్యారేజీ బ్యాగ్‌లు, జిల్లా శాఖ కుటుంబ సంక్షేమ పథకం సభ్యులు పంపిన వాటర్ బాటిల్స్‌ను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తిరుపతయ్య, రంతు జానీ, సురేష్, కుమారి, పేరాల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కారం



వలేటివారిపాలెం: పాల్గొన్న తహసీల్దార్ అబ్దుల్‌అమీద్



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్

ఉదయగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లిలో తహసీల్దారు సుభ ద్ర పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో అంజాద్, సిబ్బందిపాల్గొన్నారు.

● దుత్తలూరులో: భైరవరంలో తహసీల్దారు వై.నాగరాజు పాల్గొని అర్జీ లను తీసుకున్నారు. అనంతరం గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సర్వే రాళ్లపై బొమ్మలు, పేర్లు తొలగింపును పరిశీలించారు. త్వరితగతిన సర్వేరాళ్లపై ఉన్న వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● జలదంకి: జమ్మలపాలెంలోని రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ప్రమీ లకు పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. 45రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులో సర్పంచ్ బుర్రి శ్రీవేణి, మాజీ స ర్పంచ్ నక్కా మాధవరావు, నీటిసంఘం అధ్యక్షుడు జాజుల కోటయ్య, ఆర్ఐ శ్రీజ, వీఆర్వో ఫణి, సర్వేయర్ శోభన్, రీసర్వే డిటి శ్యాంసన్ పాల్గొన్నారు.

● సంగం: మండలంలోని వంగల్లులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లానాయక్ అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజనారాయణ, సర్వేయర్ శివరంజని, వీఆర్వో, స్థానిక టీడీపీ నాయకులు రఘురామయ్య, రైతులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: మండల తహసీల్దార్ అబ్దుల్‌అమీద్‌జమీన్‌ఉప్పలపాడులో సదస్సులో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కా ర్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో బాదుల్లా, విలేజ్ సర్వేయర్ నాగమణి రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల నిరసన



నిరసనలో పాల్గొన్న లక్కు కృష్ణప్రసాద్, రైతులు

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అనంతసాగరం, చేజర్ల, ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాలకు చెందిన సుమారు 750 మంది రైతులు వ్యవసాయ మోటర్లుకు డబ్బులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌వైర్లు సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతాల రైతులకు సకాలంలో విద్యుత్ పరికరాలు అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం



కావలి: మాట్లాడుతున్న డీపీటీవో మురళీ బాబు, పక్కన దివ్య కామాక్షి, కల్పన

కావలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయం పెంపు కోసం చేపట్టిన కార్గో సేవల్లో భాగంగా ప్రతి ఆర్టీసీ ఉద్యోగి కనీసం నలుగురి నుంచి డోర్ డెలివరీ పార్శిళ్లు బుక్ చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) మురళీ బాబు కోరారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డోర్ డెలివరీ మాసోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న పార్శిల్ కొరియర్ రవాణా సేవల గురించి ఆర్టీసీ ఉద్యోగులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రస్తుతం క్రిస్టమస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను దృష్టిలో పెట్టుకుని నెల రోజులలో డోర్ డెలివరీ పార్శిల్స్ పెంచి ఆర్టీసీకి ఆదాయం సమకూర్చాలన్నారు. దేశంలో మొదటిసారిగా ఏపీఎస్ ఆర్టీసీ సరుకు రవాణా చార్జీలను ప్రారంభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరు దివ్య కామాక్షి, డిపో అసిస్టెంట్ మేనేజరు కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ ఖాజామొహిద్దీన్, బస్టాండ్ ఇన్‌చార్జి రమేష్‌బాబు, రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పెంచలయ్య, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ పాల్గొన్నారు.



కందుకూరు: మాట్లాడుతున్న టీవీఎన్ లక్ష్మి కామాక్షి, కల్పన

60ఏళ్లు పైబడిన వారు డ్రైవర్లుగా నియమించొద్దు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లు, కాలే జీల నిర్వాహకులు తమ బ స్సులకు 60ఏళ్లు దాటిన వారి ని డ్రైవర్లుగా నియమించ కుండా స్వీయనియంత్రణ పాటించాలని కందుకూరు ప్రాంతీయ రవాణా అధికారి టీవీ. ఎన్. లక్ష్మి కోరారు. స్థానిక రవా ణాశాఖ ప్రాంతీయ కార్యాలయంలో స్కూల్స్, కాలేజీల బస్సు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహనా సమావేశంలో మాట్లాడారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని, బస్సులు స్టార్ట్ చేసేటప్పుడు చుట్టుపక్కల చూసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓవర్‌స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ చెన్నారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయాలతో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం

● మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు

కావలి టౌన్, డిసెంబరు 20 (అంధ్ర జ్యోతి): దేశంలో రాజకీయ అనిశ్చితి నెల కొనడంతో ప్రజా పోరాటాలే శరణ్యంగా కన్పిస్తుందని మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాల యంలో పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటటి పెంచులయ్య అ ధ్యక్షతన జరిగిన డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వ విధానా లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను 5ఏళ్లు ఎండగట్టిన టీడీపీ అధికారంలోకొచ్చిమి న్నకుండిపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నేటికి అమలు చేయ కుండా కూటమి ప్రభుత్వం బీజేపీకి దాసోహం అయ్యిందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జర గబేయే 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీని యర్ నాయకులు వెంకయ్య, తిరుపాల్, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, శ్రీనివాసులు, చెన్నయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జంటనాగుల శిలా ప్రతిష్ఠ

బిట్రగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం జంటనాగుల శిలా ప్రతిష్ఠ చేపట్టారు. పూజా కార్యక్రమాలకు బెంగుళూరు దుబిశెట్టి శివకుమార్, భానుశాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వేదపండితులు వేదగిరి ఆంజనేయ వరప్రసాదాచార్యులు స్వామిఅమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి జంట ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర, దుబిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చివరిగా భక్తుల కు ఆలయప్రాంగణంలో గ్రామస్థులు, భక్తులకు అన్నదానం చేపట్టారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే తనయుడి పరామర్శ



అక్బర్‌ను పరామర్శిస్తున్న కాకర్ల సంహిత్

ఉదయగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు సంహిత్ శుక్రవారం మండలంలోని బాధిత కుంటుంబాలను పరామర్శించారు. ముందుగా పట్టణంలోని సుద్ధబావి వీధిలోని షేక్ అక్బర్ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే స్థానిక కావలి మార్గంలోని ఎస్టీ కాలనీని సందర్శించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్లపడియ పంచాయతీ కోటాయలపల్లి జొన్నలగడ్డ నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నందానీ, నల్లిపోగు నరసింహులు, తుమ్మల కిరణ్, సీహెచ్ శివకృష్ణ, బాబు, అంకయ్య, మాల్యాద్రి పాల్గొన్నారు.

దొంగతనాలపై పోలీసుల మైక్ ప్రచారం



ప్రచారం చేయిస్తున్న ఎస్ఐ భోజ్యా

బిట్రగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీలు జరుగకుండా ఉండేలా విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటిస్తు పోలీసులకు సహకరించాలని ఎస్సై భోజ్యా స్థానికులను హెచ్చరించారు. చోరీలపై నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ భోజ్యా శుక్రవారం బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో ఆటోలో మైక్‌లను ఏర్పాటు చేయించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగల సమయంలో ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం తెలియజే యాలన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రజా సంఘాల నిరసన



అల్లూరు: నిరసన తెలుపుతున్న దళితులు



ఉదయగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఉదయగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బీఆర్ అంబేద్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. అమిత్‌షా బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కోడె రమణయ్య, పడ్స్ రమణయ్య, ఎస్.బాలయ్య, శ్రీరాములు, ఆర్.తిరుపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచేలా పెద్దల సభలో మాట్లాడటం యావత్తు జాతిని అవమానించినట్లే బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మరియం శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీ రాజ్యాంగ సవరణతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు. ౦.

● అల్లూరు: అంబేద్కర్‌ను పార్లమెంట్ సభలో అవమానపరచిన కేంద్రమంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరు దళితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎల్లు సాల్మన్‌రాజు, పప్పు సుధాకర్, పంగులూరు చిన్నయ్య, ముసలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, సతీష్, చెంతాటి సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ముస్లిం మైనార్టీ సలహాదారుడికి శుభాకాంక్షలు

సంగం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పెందుర్తిలో జరిగిన నూర్‌బాషా సంఘం మహాసభ జన గర్జనకు హాజరైన రాష్ట్ర ముస్లిం మైనార్టీ సలహాదారుడు ఎంఏ షరీఫ్‌ను శుక్రవారం నూర్‌బాషా సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఖాజారంతుల్లా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నూర్‌బాషా సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎల్‌పురంలో దోమల నివారణ చర్యలు

బిట్రగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలో అధికారులు శుక్రవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. కోవూరుపల్లి వైద్యులు రాజశేఖర్ పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని అంతర్గత కాలువల్లో నిల్వ ఉన్న నీటిపై దోమలు చేరకుండా స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోష్ణ, ఆశావర్కర్లు, స్థానికులు ఉన్నారు.